ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

ఆదివారం, 01 నవంబర్ 2016 | సంపుటి: 28 సంచిక: 193
Sunday 01 November 2026 | Vol.No 28 Issue No .193
హైదరాబాద్ | Hyderabad
➩ పేజీలు: 12+12
➩ వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి సేవలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

- కుటుంబ సమేతంగా లక్ష్మీనరసింహుడి దర్శనం
- 2027 దేవస్థానం వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, అక్టోబర్ 31(విజన్ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న తెలంగాణ వేద విద్వన్మహాసభలకు హాజరైన ఆయనకు మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం దేవస్థానం రూపొందించిన

2027 నూతన వార్షిక క్యాలెండర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన బోర్డు సభ్యుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) GSLV`F18 రాకెట్ ద్వారా NVS`03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయి అని ప్రశంసించారు. రవాణా, విమానయానం, సముద్ర నావిగేషన్, పర్యవేక్షణ, అత్యవసర సేవల వంటి కీలక రంగాల్లో చీూా-03 మెరుగైన సేవలు అందించనుందని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

మూడేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ
పనితీరు ఎలా ఉంది?

- మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై సీక్రెట్ సర్వే చేయిస్తున్న రేవంత్ రెడ్డి
- ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిప్రాయాల గురించి సునీల్ కనుగోలుతో రహస్య సర్వే
- ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సర్వే, ఫలితాలపై పార్టీలో ఉత్కంఠ

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సీక్రెట్ సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. ఈ మూడేళ్ల పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది, ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఏ విధమైన అభిప్రాయం ఉంది అనే అంశాలపై ఈ సర్వే ద్వారా సీఎం స్వయంగా అంచనా వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2023 డిసెంబర్ లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహలక్ష్మి, రైతు భరోసా, యువతకు ఉద్యోగ అవకాశాల హామీ వంటి అంశాలను ప్రజల ముందు ఉంచింది. ఈ పథకాలు ప్రజలకు ఎంత మేరకు అందుతున్నాయి, ప్రజలు వాటిపై ఎలా స్పందిస్తున్నారు అనేది తెలుసుకోవడానికే ఈ సర్వే ఉద్దేశించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ప్రజలు ఏం అనుకుంటున్నారనే దానిపై ప్రముఖ వ్యూహకర్త సునీల్ కనుగోలుతో

రహస్య సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. సునీల్ కనుగోలు గతంలో కాంగ్రెస్ పార్టీ విజయంలో కీలక పాత్ర

మిగతా2లో..

భారతరత్న ఇందిరా గాంధీ 42వ వర్ధంతి

- శక్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి

ఉక్కు మహిళ సేవలను స్మరించుకున్న సీఎం, ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రకటన

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31,న్యూ ఢిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలోని ఆమె సమాధి 'శక్తి స్థల్' వద్ద పుష్పాంజలి ఘటించారు. శనివారం న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం శక్తి స్థల్ కు చేరుకున్నారు. సోనియా గాంధీ తో పాటు అక్కడ ఇందిరా గాంధీ సమాధి వద్ద పూలమాల వేసి, మౌనంగా నివాళు

లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, అధికారులు కూడా పాల్గొని నివాళి అర్పించారు.

దేశ చరిత్రలో చెరగని ముద్ర

1984 అక్టోబర్ 31న దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఇందిరా గాంధీని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. భారత ప్రధానిగా ఆమె 15 ఏళ్ల పాటు దేశాన్ని పరిపాలించారు. ఆమె హయాంలో దేశం అనేక కీలక మార్పులను చూసింది. హరిత

మిగతా2లో..

మంచిరేవుల 142 ఎకరాలు, మియాపూర్ భూముల వెనుక
అసలు నిజం ఇదే

- రేవంత్ రెడ్డి క్రెడిట్ కోసం అబద్ధాలు చెబుతున్నారు: హరీష్ రావు సంచలన ఆరోపణలు
- కాంగ్రెస్ హయాంలో భూమి పోగొట్టుకున్నారు, మేము కాపాడుకున్నాం
- గ్రేహౌండ్స్ భూమిలో 10 ఎకరాల స్కామ్ పై విచారణ జరపాలి: మాజీ మంత్రి డిమాండ్

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర,అక్టోబర్ 31, తెలంగాణ భవన్: మంచిరేవుల, మియాపూర్ భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆ భూములను కాపాడింది తామేనని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఆ భూములు పోగొట్టుకున్నారని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు మంచిరేవుల, మియాపూర్ భూముల చరిత్రను ఒకదాని తర్వాత ఒకటి వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులను బయటపెట్టారు.

మిగతా9లో..

స్పెషల్ స్టోరీ విజన్ ఆంధ్ర...

పేదల తిరుపతి కురుమూర్తి జాతర షురూ...
పాలమూరు గుండెల్లో గోవింద నామం

- మీసాల రాయుడు అని కూడా పిలిచే కరుణామూర్తి

- నవంబర్ 10 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు, 16న ఉద్దాల మహోత్సవం
- 10న కల్యాణోత్సవం, 14న అలంకార ఉత్సవం, కన్నుల పండుగగా జాతర

తెలంగాణ స్టేట్ బ్యూరో, అక్టోబర్ 31: పాలమూరు అంటేనే భక్తి. పాలమూరు అంటేనే మొక్కుబడి. ఈ గడ్డ మీద పుట్టిన ప్రతి బిడ్డకు ఇలవేల్పు అంటే కురుమూర్తి స్వామే. తిరుపతికి వెళ్లలేని పేద భక్తుడు, పొట్టకూటి కోసం కూలి పనులు చేసుకునే రైతు, దూర పల్లెల్లోని అవ్వ తాతలు సైతం నమ్మకంతో చేతులు జోడించే దివ్య క్షేత్రం ఇది. అందుకే ఈ క్షేత్రానికి ఒకే ఒక్క పేరు స్థిరపడిపోయింది. అదే పేదల తిరుపతి.. అంతే కాదు, ఈ స్వామివారికి మీసాల రాయుడు అని కూడా ఒక ప్రేమ పేరు ఉంది. ఆ పేరుతోనే పాలమూరు జిల్లాలో లక్షలాది మంది భక్తులు స్వామివారిని పిలుచుకుంటారు. మీసాల రాయుడు అంటే భక్తులను కాపాడే రాజు, మీసం మెలేసి మాట ఇచ్చే మహా రాయుడు అని భక్తుల నమ్మకం. ఈ ఏడాది ఈ పేదల తిరుపతిలో బ్రహ్మోత్సవాలు నవంబర్ 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఈ 15 రోజుల పాటు కురుమూర్తి కొండల

మిగతా2లో..

హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ ముసుగులో
అండాల సేకరణ

- బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో పోలీసుల మెరుపు దాడి, 10 మంది యువతుల రక్షణ
- ఏడాదిగా హాస్టల్ ముసుగులో అక్రమ వ్యాపారం, సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయం
- పురుషుల వీర్యకణాలు కూడా సేకరిస్తున్నారా? దర్యాప్తులో సంచలనం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31: హైదరాబాద్ నడిబొడ్డున కలకలం రేపే ఘటన వెలుగులోకి వచ్చింది. గర్ల్స్ హాస్టల్ అనే ముసుగులో ఏడాది కాలంగా అండాల సేకరణ అనే అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని ఓ హాస్టల్‌పై పోలీసులు మెరుపు దాడి చేసి ఈ రాకెట్‌ను బట్టబయలు చేశారు. ఈ ఘటనతో నగరంలో మహిళల భద్రతపై మళ్లీ పెద్ద చర్చ మొదలైంది.

హాస్టల్ ముసుగులో ఏడాది నుంచి అక్రమాలు

బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఉన్న ఈ హాస్టల్‌కు వచ్చే పోయే వారికి ఇది కేవలం ఒక సాధారణ గర్ల్స్ హాస్టల్‌లాగే కనిపించేది. బయటకు చూస్తే పేద విద్యార్థినులు, ఉద్యోగినులు ఉంటున్న సాధారణ హాస్టల్. కానీ లోపల మాత్రం అక్రమ కార్యకలాపాలు సాగుతున్నాయని పోలీసులకు అందిన సమాచారంతో వారు చాలా రోజులుగా నిఘా పెట్టారు. ఏడాది కాలంగా ఈ హాస్టల్ ముసుగులో యువతులను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, వారి నుంచి అండాలను సేకరిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. పేద కుటుంబాలకు చెందిన యువతులకు ఉద్యోగం ఇప్పిస్తామని, హాస్టల్‌లో ఉచిత వసతి కల్పిస్తామని చెప్పి వారిని నమ్మించి

మిగతా2లో..

మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- నేరాల నియంత్రణ, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసుల విస్తృత తనిఖీలు
- మాచారం గ్రామంలో 200కు పైగా ఇళ్ల తనిఖీ, వాహనాలు, బెల్ట్ షాపులపై ప్రత్యేక దాడులు
- జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాలతో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ఈ కార్యక్రమం

తెలంగాణ స్టేట్ బ్యూరో,విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, నేరాల నివారణతో పాటు ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని మరింత పెంపొందించడమే లక్ష్యంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ కమ్యూనిటీ కనెక్టింగ్ పోలీసింగ్

మిగతా2లో..

స్థానిక ఎన్నికల్లో సీసీ ఫుటేజీపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక ఆదేశాలు

- మున్సిపల్ నుండి గ్రామ పంచాయతీ వరకు అన్ని ఎన్నికలకు సీసీటీవీ / వీడియోగ్రఫీ తప్పనిసరి
- నామినేషన్ దగ్గర నుండి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి అడుగు వీడియోలో రికార్డు కావాల్సిందే
- ఎన్నికల పిటిషన్ తుది పరిష్కారం అయ్యే వరకు ఫుటేజీ భద్రపరచాలని స్పష్టమైన ఆదేశం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకత, నిష్పక్షపాతత కోసం సుప్రీంకోర్టు చారిత్రాత్మక ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలు రాష్ట్రంలో జరగనున్న స్థానిక ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలన్నింటికీ సీసీటీవీ / వీడియోగ్రఫీ కవరేజీ తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నిక ప్రక్రియలో ఏ దశలోనూ అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది.

నామినేషన్ కేంద్రాల నుండే నిఘా

నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో సీసీటీవీ / వీడియోగ్రఫీ ఏర్పాటు చేయాలని ఆదేశం ఇచ్చింది. అభ్యర్థులు నిరాటంకంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎలాంటి అడ్డంకులు రాకుండా చూడాలని, అవసరమైతే పోలీసు బందోబస్తు కల్పించాలని డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ నుండి లెక్కింపు వరకు ప్రత్యక్ష నిఘా పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు,

మిగతా2లో..

ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్.. సర్వం సిద్ధం.. ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నీడ!

- ఆంధ్రప్రదేశ్‌లో పుర, నగర పాలక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- 36,351 మంది పోలీసులతో చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ బందోబస్తు
- సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు లేదా వెబ్‌కాస్టింగ్
- దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు
- ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఈసీ పిలుపు

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలక, నగర పాలక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా

మిగతా2లో..

స్థానిక ఎన్నికల్లో సీసీ ఫుటేజీపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక ఆదేశాలు

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోనూ సీసీటీవీ / వీడియోగ్రఫీ కవరేజీ ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఓటింగ్ సమయంలో, ఓట్ల నిల్వ సమయంలో, లెక్కింపు సమయంలో జరిగే ప్రతి కార్యక్రమం వీడియోలో నమోదు కావాలని కోర్టు తెలిపింది.

ఫుటేజీ భద్రపరచడం తప్పనిసరి

ఎన్నికల పిటిషన్ల దాఖలుకు నిర్ణయించిన గడువు ముగిసే వరకు వీడియో ఫుటేజీని భద్రపరచాలని ఆదేశించింది. కేవలం గడువు వరకు మాత్రమే కాకుండా, ఎన్నికల పిటిషన్ దాఖలైతే కేసు తుది పరిష్కారం అయ్యే వరకు వీడియో ఫుటేజీని భద్రపరచాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ట్రిబ్యునల్, పిటిషనర్లకు అందుబాటులో ఉంచాలి

ఎన్నికల ట్రిబ్యునల్ కోరినప్పుడు సంబంధిత వీడియో ఫుటేజీని వెంటనే అందించాలని ఆదేశించింది. అలాగే ఎన్నికల పిటిషన్‌లో భాగస్వాములైన వారికి దరఖాస్తు చేసుకున్న వెంటనే వీడియో ఫుటేజీ అందుబాటులో ఉంచాలని తెలిపింది. దీనివల్ల ఎన్నికల వివాదాల్లో నిజానిజాలు బయటపడతాయని కోర్టు అభిప్రాయపడింది.

ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి ఆదేశం ఇచ్చింది. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని వీడియో నిఘాలో ఉంచడం ద్వారా ప్రజాస్వామ్య విలువలు కాపాడబడతాయని, ఓటర్లకు, అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఆదేశాలతో రాబోయే స్థానిక ఎన్నికల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా పోతుందని, ప్రతి దశ పూర్తి పారదర్శకంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఏపీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్.. సర్వం సిద్ధం.. ప్రతి పోలింగ్ కేంద్రంపై కెమెరా నీడ!

నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అనిల్ పునేతా వెల్లడించారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని కెమెరాల నిఘా పరిధిలోకి తీసుకొచ్చామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ఏర్పాట్లపై ఆయన మీడియా సమావేశంలో పూర్తి వివరాలు అందించారు.

36 వేల మంది పోలీసులతో పటిష్ఠ భద్రత

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా స్థానిక ఎన్నికల కోసం 36,351 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, నార్మల్‌గా వర్గీకరించారు. హైపర్ సెన్సిటివ్ కేంద్రాల్లో 1+4 (ఒక అధికారి, నలుగురు సిబ్బంది), సెన్సిటివ్ కేంద్రాల్లో 1+3 పద్ధతిలో భద్రత కల్పిస్తున్నారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, భద్రత కోసం 1,543 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించేందుకు డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను అందుబాటులో ఉంచారు. పల్నాడు వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ఏపీ స్పెషల్ పోలీస్‌కు చెందిన 130 ప్లటూన్లను మోహరించారు. డీజీపీ కార్యాలయం నుంచి పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, క్విక్ రియాక్షన్ బృందాలు కూడా సిద్ధంగా ఉన్నాయని పునేతా వివరించారు.

సుప్రీం ఆదేశాలతో సంపూర్ణ నిఘా

ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇప్పటికే 6,600 పోలింగ్ లొకేషన్లలో 12,000 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,500 సమస్యాత్మక (సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్, క్రిటికల్) కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కెమెరాలు లేని చోట్ల వీడియోగ్రఫీ, అది కూడా సాధ్యం కాని మారుమూల ప్రాంతాల్లో ల్యాప్‌టాప్‌ల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం లోపల, బయట జరిగే ప్రతి కదలికను రికార్డు చేస్తామని అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలు చివరి నిమిషంలో వచ్చినా, సాధ్యమైనంత వరకు అన్ని కేంద్రాలను నిఘా పరిధిలోకి తెచ్చేందుకు కట్టుబడి ఉన్నామని పునేతా పేర్కొన్నారు.

బరిలో 9,642 మంది అభ్యర్థులు.. 75 వేల సిబ్బంది

రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 70 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేషన్ మేయర్/ఛైర్‌పర్సన్ పదవులకు 153 మంది, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులకు 367 మంది పోటీలో ఉన్నారు. కార్పొరేషన్లలోని 922 వార్డులకు 3,773 మంది, మున్సిపాలిటీల్లోని 2,382 వార్డులకు 6,669 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం మీద వార్డు పదవుల కోసం 9,642 మంది పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు దాదాపు 75 వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే డిస్పాచ్ కేంద్రాల నుంచి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం వివరాలను మీడియాకు వెల్లడిస్తామని ఎస్ఈసీ తెలిపింది.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉందని ఎస్ఈసీ అనిల్ పునేతా అభిప్రాయపడ్డారు. ఓటర్లలో చైతన్యం పెంచేందుకు మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీలు (పిడుగురాళ్ల, గుడిజాల, దాచేపల్లి, దార్సి, పలమనేరు, ప్రొద్దుటూరు, రాయచోటి, కమలాపురం) ఏకగ్రీవం అయినందున అక్కడ ఎన్నికలు జరగడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎక్కువ కాలం అమల్లో ఉంటే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అందుకే ఈ ప్రక్రియను త్వరగా ముగించడం అందరికీ శ్రేయస్కరమని పునేతా పేర్కొన్నారు.

భారతరత్న ఇందిరా గాంధీ 42వ వర్ధంతి

విప్లవం ద్వారా దేశాన్ని ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధి వైపు నడిపించారు. బ్యాంకుల జాతీయీకరణతో పేదలకు బ్యాంకింగ్ సేవలు చేరువ చేశారు. 1971 యుద్ధంలో పాకిస్తాన్ ను ఓడించి, బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారణమై, ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్టను పెంచారు. అందుకే ఆమెను 'ఉక్కు మహిళ' అని ప్రజలు పిలుచుకున్నారు. కష్టమైన సమయాల్లో కూడా వెనుకడుగు వేయకుండా, దేశ ప్రయోజనాల కోసం దృఢంగా నిలబడే తత్వం ఆమె ప్రత్యేకత.

పేదల నాయకురాలు

ఇందిరా గాంధీ పాలనలో పేదల సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. 'గరీబీ హటావో' అనే నినాదంతో పేదరిక నిర్మూలనకు కృషి చేశారు. వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారు. ఆమె ఆశయాలే తమ ప్రభుత్వానికి మార్గదర్శకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, వ్యవసాయ అభివృద్ధి అనే ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణకు ఇందిరా గాంధీతో ఉన్న అనుబంధం

తెలంగాణ ప్రజలతో ఇందిరా గాంధీకి ప్రత్యేక అనుబంధం ఉంది. అత్యవసర పరిస్థితి తర్వాత కూడా ప్రజల్లో ఆమెపై ఉన్న విశ్వాసం చెదరలేదు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ఆమె హయాంలో అనేక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఆమె స్ఫూర్తితోనే తెలంగాణలో ప్రజా పాలన, సంక్షేమ పథకాల అమలుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరా గాంధీ త్యాగం, సేవ, దృఢ సంకల్పం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు, ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తాయని, ఆమె వర్ధంతి రోజున ఆమె ఆశయాలను మరోసారి గుర్తు చేసుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

పేదల తిరుపతి కురుమూర్తి జాతర షురూ... పాలమూరు గుండెల్లో గోవింద నామం

మధ్య గోవింద నామం మారుమోగనుంది. లక్షలాది భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకోనున్నారు. ఈ జాతరను చూడటానికి రెండు కళ్లు సరిపోవు అన్నట్లుగా ప్రతి రోజు ఒక ప్రత్యేక ఉత్సవం, ప్రత్యేక అలంకారం, ప్రత్యేక శోభతో కన్నుల పండుగలా సాగుతుంది.

ఏడు కొండల మధ్య కాంచన గుహలో స్వయంభూ

తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ గ్రామం సమీపంలో ఈ పుణ్య క్షేత్రం వెలసింది. మీరు కొండ దిగువన నిలబడి పైకి చూస్తే తిరుమలే కళ్ల ముందు కదలాడుతుంది. ఇక్కడ కూడా స్వామివారు ఏడు కొండలను తన ఆవాసంగా మలుచుకున్నాడు. ఆ ఏడు కొండల మధ్యలో ఉన్నదే కాంచన గుహ. ఆ గుహలోనే శ్రీ వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మ సమేతంగా స్వయంభూవుగా కొలువుదీరి ఉన్నాడు. తిరుమల వేంకటేశ్వర స్వామి మూర్తిని పోలిన విగ్రహం కావడం ఇక్కడి అత్యంత విశేషం. పూర్వం భక్తులు ఆ గుహలోకి పాక్కుంటూ, దీపం వెలుగులో వెళ్లి దర్శనం చేసుకునేవారని పెద్దలు చెబుతారు. చీకటి గుహలో దేదీప్యమానంగా వెలుగుతున్న స్వామివారిని చూస్తే మనసు పులకరించిపోతుందని భక్తులు అంటారు. ఇప్పుడు ఆ గుహ దగ్గరే సుందరమైన ఆలయం నిర్మించారు. కొండపై నుంచి చూస్తే చుట్టూ ఉన్న ప్రకృతి, పచ్చని పొలాలు, చిన్న చిన్న చెరువులు కనువిందు చేస్తాయి. ఆ ప్రకృతి మధ్యలో స్వామివారి సన్నిధి ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.

కురుమతి నుంచి కురుమూర్తి వరకు వచ్చిన కథ

స్థల పురాణం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. పూర్వం ఈ ప్రాంతానికి కురుమతి అని పేరు ఉండేది. కురవ గ్రామానికి చెందిన ఒక కుమ్మరికి స్వామివారు కలలో కనిపించి, తాను ఈ ఏడు కొండల మధ్య కొలువై ఉండాలనుకుంటున్నానని చెప్పాడని నమ్మకం. ఆ కురవ పేరు మీదుగానే కురుమతి, క్రమంగా కురుమూర్తిగా మారిందని చరిత్ర చెబుతుంది. కురుపతి అంటే ప్రభువు నివాసమున్న కొండ అనే అర్థం కూడా వస్తుందని పండితులు అంటారు. కురుమూర్తి అంటే కోరికలు తీర్చే వాడని భక్తుల నమ్మకం. ఏ కోరికతో వచ్చినా, మనసులో ఏ బాధ ఉన్నా, స్వామివారిని నమ్ముకుంటే అది తీరుతుందని ఇక్కడి భక్తుల గట్టి విశ్వాసం. ఈ నమ్మకమే పాలమూరు ప్రజలను తరతరాలుగా ఈ కొండల వైపు నడిపిస్తుంది. పిల్లలు లేని దంపతులు, అనారోగ్యంతో బాధపడేవారు, వ్యవసాయం బాగా పండాలని కోరుకునే రైతులు, ఉద్యోగం కోసం ఎదురుచూసే యువకులు అందరూ ఇక్కడికి వచ్చి మొక్కులు మొక్కుకుంటారు. మొక్కు తీరిన తర్వాత మళ్లీ వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

మీసాల రాయుడు అని ఎందుకు పిలుస్తారు?

కురుమూర్తి స్వామి విగ్రహం చూసిన ప్రతి భక్తుడికి ఒక విశేషం కనిపిస్తుంది. స్వామివారి మూర్తిలో మీసాలు స్పష్టంగా కనిపిస్తాయి. తిరుమలలో శ్రీవారు నిత్యం శుభ్రంగా, మీసాలు లేకుండా దర్శనమిస్తే, ఇక్కడ కురుమూర్తి స్వామి మీసాలతో, ఒక రాజు మాదిరిగా, రాయుడి మాదిరిగా దర్శనమిస్తాడు. అందుకే భక్తులు ఆయనను లిమీసాల రాయుడులి అని పిలుస్తారు. మీసాల రాయుడు అంటే మాట తప్పని మగ రాయుడు, భక్తులకు అండగా నిలిచే దొర, కష్టంలో ఉన్నవారిని కాపాడే కరుణామూర్తి అని అర్థం. పాలమూరు ప్రజలు ఎంతో గర్వంగా, ఎంతో ప్రేమతో ఈ పేరుతో స్వామివారిని పిలుచుకుంటారు. మొక్కులు మొక్కుకునేటప్పుడు కూడా మీసాల రాయుడా, మా మొర వినరా అని మొరపెట్టుకుంటారు. ఈ పేరు వెనుక మరో భావన కూడా ఉంది. రాజు అంటే భక్తులందరినీ సమానంగా చూసేవాడు, పేద ధనిక తేడా లేకుండా అందరినీ కాపాడేవాడు. మీసాల రాయుడు అంటే అహంకారం ఉన్నవారిని అణిచి, పేదలను పైకి లేపే దైవం అని భక్తులు చెబుతారు.

700 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం

కురుమూర్తి వెంకటేశ్వరస్వామి దేవస్థానం సా.శ. 1268 ప్రాంతంలో ముక్కెర వంశ మూలపురుషుడు గోపాలరాయుడు నిర్మించాడని శాసనాలు చెబుతున్నాయి. 1350లో చంద్రారెడ్డి దీనిని మరింత అభివృద్ధిపరిచాడు. సోమభూపాలరావు కొండపైకి మెట్లు నిర్మించి ఏటా జాతర నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించాడు. 1870లో ఉద్దాల మండపం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ క్షేత్రానికి ప్రత్యేక శోభ వచ్చింది. తిరుమలలో శ్రీవారికి అలిపిరి మండపం ఉంటే, కురుమూర్తి శ్రీవారికి ఉద్దాల మండపం ఉంది. అదే ఈ క్షేత్రానికి ప్రాణం. ఆలయ గోడలు, గోపురం దక్షిణ భారత శైలిలో చెక్కబడి ఉన్నాయి. హిందూ దేవదేవీల విగ్రహాలు, శిల్పకళ కళ్లను కట్టిపడేస్తాయి. కొండ దిగువన ఉన్న పెద్ద బావి కూడా ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. ఆ బావి నీటితోనే స్వామివారి అభిషేకం జరుగుతుందని చెబుతారు. ఆలయ ప్రాంగణంలో చెక్కిన ప్రతి శిల్పం, ప్రతి స్తంభం ఏడు వందల ఏళ్ల చరిత్రను చెబుతుంది. ఆ శిల్పాలను చూస్తే పూర్వకాలపు శిల్పుల భక్తి, నైపుణ్యం అర్థమవుతుంది.

నవంబర్ 10 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు, కన్నుల పండుగ

ఈ ఏడాది కురుమూర్తి బ్రహ్మోత్సవాలు నవంబర్ 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరుగుతాయి. దీపావళి తర్వాత వచ్చే ఈ ఉత్సవాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ జాతర కన్నుల పండుగగా అంగరంగ వైభవంగా సాగుతుంది. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు ఇలా ఉన్నాయి. పదవ తారీఖున స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. శ్రీవారి కల్యాణం చూడటానికి దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, హారతుల మధ్య స్వామివారి కల్యాణం జరిగే సమయంలో ఆ ప్రాంతమంతా దివ్యమైన వాతావరణంతో నిండిపోతుంది. పెళ్లి కాని వారు ఈ కల్యాణోత్సవం చూస్తే త్వరలోనే వివాహం అవుతుందని భక్తుల నమ్మకం. 14వ తారీఖున స్వామివారి అలంకార ఉత్సవం ఉంటుంది. ఆ రోజు స్వామివారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ అలంకారాన్ని చూసి భక్తులు పరవశించిపోతారు. బంగారు కిరీటం, ముత్యాల హారాలు, పూలమాలలతో స్వామివారు సాక్షాత్తు శ్రీనివాసుడిగా దర్శనమిస్తాడు. ఆ రోజు మీసాల రాయుడిని రాజులా అలంకరిస్తే చూడటానికి రెండు కళ్లు సరిపోవు.

16న ఉద్దాల మహోత్సవం, అదే ప్రధాన ఘట్టం

ఈ బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన ప్రధాన ఘట్టమైన స్వామి వారి ఉద్దాల మహోత్సవం 16వ తారీఖున జరగనుంది. ఈ రోజు కోసం లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తారు. ఈ ఒక్క రోజు కోసమే ఎంతో మంది నెల రోజుల ముందు నుంచే మొక్కులు మొక్కుకుంటారు. తోలుతో చేసిన స్వామి వారి పాదుకలను ఈ ఉద్దాల మహోత్సవంలో కొండపైకి ఘనంగా ఊరేగింపు చేస్తారు. మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామంలో చర్మకారులు, దళిత భక్తులు వారం రోజుల పాటు ఉపవాస దీక్షతో, అత్యంత భక్తి శ్రద్ధలతో రాయలసీమ నుంచి తెప్పించిన ఆవు చర్మంతో స్వామివారి పాదుకలను తయారు చేస్తారు. ఆ పాదుకలను తయారుచేసే సమయంలో ఎవరూ మాంసాహారం ముట్టరు, నియమ నిష్ఠలతో ఉంటారు. ఆ సమయంలో పూర్తి శుచి శుభ్రత పాటిస్తారు. పాదుకలు తయారు చేసే వారు ప్రతిరోజు స్వామివారిని ధ్యానిస్తూ, భజనలు చేస్తూ పనిచేస్తారు. ఆ పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అప్పంపల్లి, తిరుమలపురం గ్రామాల మీదుగా ఊరేగింపుగా కురుమూర్తి క్షేత్రానికి తీసుకువస్తారు. పల్లమర్రి నుంచి చాటను ఊరేగింపుగా తీసుకురావడం కూడా ఒక ఆచారం. ఊరేగింపు వెంట భక్తులు గోవింద నామాలు పాడుతూ, డోలు వాయిద్యాలతో నడుస్తారు. ఆ సమయంలో చూసేవారికి స్వర్గం భూమి మీదకు వచ్చినట్లు అనిపిస్తుంది. ఉత్సవం రోజున ఆ పాదుకలను ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర పూజించి ఉద్దాల మండపంలో ఉంచుతారు. ఆ పవిత్రమైన పాదాలతో భక్తుల వీపులపై పెట్టి స్వామి వారి ఆశీర్వాదం ఇస్తారు. వీపుపై ఆ పాదుకలతో కొట్టించుకుంటే పాపాలు పోతాయని, రోగాలు నయమవుతాయని భక్తుల గట్టి నమ్మకం. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఆ పాదుకల దెబ్బ కోసం ఎంతో భక్తితో వరుసలో నిలబడతారు. అందుకే ఆ రోజు ఐదు లక్షల మందికి పైగా భక్తులు తరలివస్తారు. మొత్తం బ్రహ్మోత్సవాలకు పది లక్షల మంది వరకు హాజరవుతారని అంచనా.

లక్షలాది భక్తులతో జాతర, నాలుగు రాష్ట్రాల భక్తి ప్రవాహం

ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. కొందరు మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణ చేస్తారు. మరికొందరు తలనీలాలు సమర్పించి, కొండ దిగువన మట్టి కుండలో పచ్చి పులుసు, అన్నం తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. మొక్కు తీరిన ప్రతి భక్తుడు స్వామివారికి కృతజ్ఞతగా పొంగలి, పులిహోర వంటి నైవేద్యాలు సమర్పిస్తారు. ఆ నైవేద్యాన్ని చుట్టూ ఉన్న భక్తులందరికీ ప్రసాదంగా పంచుతారు. ఆ ప్రసాదం తింటే స్వామివారి అనుగ్రహం లభిస్తుందని భక్తులు భావిస్తారు. కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, ఉద్దాల మండపం ప్రతి భక్తుడిని కట్టిపడేస్తాయి. కొండపైకి వెళ్లడానికి దాదాపు 200 మెట్లు ఎక్కాలి. ఆ ఎక్కడమే ఒక తపస్సు. దారిలో చిన్న చిన్న గుళ్లు, చుట్టూ పచ్చని ప్రకృతి, మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తాయి. నడిచే దారంతా భక్తుల జై గోవింద నినాదాలతో మారుమోగుతుంది. వృద్ధులు, చిన్న పిల్లలు కూడా గోవిందా అంటూ మెట్లు ఎక్కడం చూస్తే మనసు నిండిపోతుంది. మీసాల రాయుడు పేరు చెబుతూ ఎక్కే ప్రతి మెట్టు భక్తుడికి ఒక ఆనందాన్ని ఇస్తుంది.

స్వామివారి మహిమలు, భక్తుల అనుభవాలు

కురుమూర్తి స్వామి మహిమల గురించి చెప్పుకుంటే ఎన్నో కథలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా పిల్లలు లేని దంపతులకు ఇక్కడ మొక్కుకుంటే పిల్లలు పుడతారని, తీవ్రమైన అనారోగ్యం ఉన్నవారు స్వామిని దర్శించుకుంటే కోలుకుంటారని, కోర్టు కేసుల్లో ఉన్నవారికి న్యాయం జరుగుతుందని భక్తులు చెబుతారు. ప్రతి ఏటా జాతరకు వచ్చే భక్తులలో ఎంతో మంది తమ అనుభవాలను చెబుతారు. మొక్కు మొక్కున్న తర్వాత తమ కష్టాలు తీరాయని, మీసాల రాయుడు తమను కాపాడాడని కన్నీళ్లతో చెబుతారు. అందుకే ఈ క్షేత్రాన్ని పేదల తిరుపతి అని పిలుస్తారు. తిరుపతికి వెళ్లే శక్తి, సమయం లేని పేద భక్తుడికి స్వామి ఇక్కడే దర్శనమిస్తాడు. ఇక్కడ దర్శించుకుంటే తిరుమల దర్శనంతో సమానమని పెద్దలు చెబుతారు.

మొక్కుల తల్లి, మొక్కులు తీర్చే దైవం

కురుమూర్తి అంటే కేవలం ఒక ఆలయం కాదు. అది పాలమూరు ప్రజల గుండె చప్పుడు. పేదవాడి ఆశ, బడుగువాడి బలం. తిరుపతికి వెళ్లే శక్తి లేనివాడికి, స్వామి ఇక్కడికి వచ్చి దర్శనమిచ్చినట్లే. మీసాల రాయుడు అనే పేరు ఈ అనుబంధాన్ని మరింత గట్టి చేస్తుంది. రాయుడు అంటే తన ప్రజలను కాపాడే రాజు. ఆ రాజు ఈ కొండల్లోనే ఉంటాడు, ప్రతి భక్తుడి మొర వింటాడు. అందుకే ప్రతి ఏటా దీపావళి తర్వాత ఆ కొండల మధ్య గోవింద నామం మారుమోగుతుంది. ఈ ఏడాది నవంబర్ 10 నుంచి 25 వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మీసాల రాయుడి కృపకు పాత్రులు కావాలని అందరూ కోరుకుంటున్నారు. 10న కల్యాణోత్సవం, 14న అలంకార ఉత్సవం, 16న ఉద్దాల మహోత్సవం చూడటానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షల దీపాలు, లక్షల మొక్కులు, ఒక్కటే నమ్మకం. మీసాల రాయుడు ఉంటే, కష్టం ఏదైనా తీరుతుంది.

మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోంది. జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, శనివారం ఉదయం జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచారం గ్రామంలో ప్రత్యేక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ లో భాగంగా పోలీసు అధికారులు గ్రామంలోని 200కు పైగా ఇళ్లను సందర్శించి, నివాసితుల వివరాలు, గుర్తింపు కార్డులు, ఇతర అధికారిక ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఆరా తీశారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నారా అనే అంశంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

సరైన పత్రాలు లేని 28 వాహనాలు స్వాధీనం

తనిఖీల్లో భాగంగా సరైన వాహన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఒక ఆటోను గుర్తించి స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహన యజమానులు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అవసరమైన ధ్రువపత్రాలను చూపించి వాహనాలను తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు. భవిష్యత్తులో వాహన పత్రాలు లేకుండా రోడ్డుపైకి రావద్దని హెచ్చరించారు.

అక్రమ బెల్ట్ షాపులపై దాడి, 36 బీర్ బాటిళ్లు పట్టివేత

అదేవిధంగా గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 36 బీర్ బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై ఎక్సైజ్ చట్టం కింద కేసులు నమోదు చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

కమ్యూనిటీ పోలీసింగ్ పై ఎస్పీ డి.జానకి వివరణ

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్ అనేది కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా పోలీసులకు, ప్రజలకు మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమమని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో నేరాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి అరికట్టడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాహనదారులు ఆర్సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల కార్యకలాపాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు ప్రజలు నిర్భయంగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు క్లిక్ చేయడం, ఓటీపీలు ఇతరులకు చెప్పడం, బ్యాంకు ఖాతా వివరాలు పంచుకోవడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమణరెడ్డి, జడ్చర్ల టౌన్ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ ముసుగులో అండాల సేకరణ

తీసుకువచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హాస్టల్‌లో ఉంటున్న యువతులకు తమపై ఏమి జరుగుతుందో కూడా తెలియకుండా, వారిని ఒత్తిడి చేసి అండాలు సేకరించేవారని తెలుస్తోంది. అండాలు సేకరించడం అనేది వైద్యపరంగా చాలా ప్రమాదకరమైన ప్రక్రియ. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా, అనధికారికంగా ఇలా చేయడం వల్ల యువతుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుంది. అంతే కాదు, భవిష్యత్తులో వారికి పిల్లలు పుట్టే అవకాశం కూడా దెబ్బతింటుందని వైద్యులు చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాల యువతులే లక్ష్యం, పేదరికమే బలహీనత

పోలీసుల అదుపులో బిహార్, యూపీ, ఒడిశాకు చెందిన 10 మంది యువతులు ఉన్నట్లు తెలిసింది. వీరందరూ పేద కుటుంబాల నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. ఇతర రాష్ట్రాల నుంచి యువతులను తీసుకురావడం వెనుక పెద్ద వ్యూహం ఉంది. వారికి ఇక్కడి భాష, పరిస్థితులు తెలియవు. ఎవరిని ఆశ్రయించాలో తెలియదు. బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు. అందుకే వీరిని సులభంగా మోసం చేసి, తమ గుప్పిట్లో ఉంచుకునేవారని పోలీసులు చెబుతున్నారు. ఈ యువతులను హాస్టల్ నుంచి బయటకు వెళ్లకుండా నియంత్రించేవారని, వారి ఫోన్లు, గుర్తింపు కార్డులు కూడా లాక్కునేవారని సమాచారం. హాస్టల్ అంటేనే వారికి ఒక జైలులా మారిందని, బయటకు వెళ్లాలంటే అనుమతి కావాల్సిన పరిస్థితి ఉందని విచారణలో తేలింది. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరించేవారని, తమ కుటుంబాలకు చెడు చేస్తామని భయపెట్టేవారని యువతులు పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది.

సంతాన సాఫల్య కేంద్రాలకు విక్రయం, లక్షల వ్యాపారం

సేకరించిన అండాలను హైదరాబాద్‌లోని కొన్ని సంతాన సాఫల్య కేంద్రాలకు, అంటే ఫర్టిలిటీ క్లినిక్‌లకు భారీ మొత్తానికి విక్రయిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. సంతానలేమితో బాధపడే దంపతులకు అండాలు అవసరం అవుతాయి. చట్టప్రకారం అండదానం అనేది స్వచ్ఛందంగా, పూర్తి నియమాలతో, ప్రభుత్వ అనుమతితో జరగాలి. దాతకు కూడా పూర్తి సమాచారం ఇచ్చి, ఆమె అంగీకారంతోనే చేయాలి. కానీ ఇక్కడ మాత్రం బలవంతంగా, అక్రమంగా సేకరించిన అండాలను అధిక ధరకు అమ్మి లాభాలు గడిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక్కో అండం కోసం లక్షల రూపాయలు చెల్లిస్తున్నారని, అందులో యువతులకు కేవలం కొంత మొత్తం మాత్రమే ఇచ్చి, మిగతాది మధ్యవర్తులు, నిర్వాహకులు పంచుకుంటున్నారని సమాచారం. ఇది ఒక పెద్ద అంతర్జాతీయ స్థాయి వ్యాపారంగా మారే ప్రమాదం ఉందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో పురుషుల నుంచి వీర్యకణాలు కూడా సేకరిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కూడా లోతైన విచారణ జరుగుతోంది. ఒకవేళ ఇది నిజమైతే ఈ రాకెట్ పరిధి మరింత పెద్దదని, ఇందులో పురుషులను కూడా లక్ష్యంగా చేసుకున్నారని అర్థమవుతుంది. దీని వెనుక ఉన్న వైద్య నిపుణులు, ఏజెంట్లు, దళారుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

పోలీసుల మెరుపు దాడి, స్వాధీనం చేసుకున్న ఆధారాలు

బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని హాస్టల్‌పై పోలీసులు అకస్మాత్తుగా మెరుపు దాడి చేశారు. ముందుగా ఎలాంటి సమాచారం లీక్ కాకుండా, ప్రత్యేక బృందంతో దాడి నిర్వహించారు. హాస్టల్‌లో లభించిన ఆధారాలు, రికార్డులు, మందులు, వైద్య పరికరాలు, సిరంజిలు, శీతలీకరణ పెట్టెలు వంటివాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హాస్టల్‌లోని రిజిస్టర్‌లో నమోదైన పేర్లు, చిరునామాలను కూడా సేకరించారు. ఈ రికార్డుల ఆధారంగా ఇప్పటివరకు ఎంతమంది యువతులను ఇలా బాధితులను చేశారో తెలుసుకునే ప్రయత్నం జరుగుతోంది. అదుపులోకి తీసుకున్న 10 మంది యువతులను పోలీసులు విచారిస్తున్నారు. వారి వాంగ్మూలం ఆధారంగా ఈ రాకెట్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రాకెట్‌లో వైద్యులు, ఏజెంట్లు, హాస్టల్ నిర్వాహకులు కూడా పాత్ర పోషించారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హాస్టల్‌లో లభించిన ఆధారాలను పరిశీలించి, డబ్బు లావాదేవీల వివరాలను కూడా సేకరిస్తున్నారు. బ్యాంక్ ఖాతాలు, ఫోన్ కాల్ రికార్డులు, వాట్సాప్ చాట్‌లు పరిశీలిస్తే ఈ ముఠా మొత్తం బయటపడుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ఇంకా చాలా మంది అరెస్టయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

మహిళల భద్రతపై మళ్లీ ప్రశ్నలు, నగరంలో భయం

ఈ ఘటన హైదరాబాద్‌లో మహిళల భద్రతపై మళ్లీ పెద్ద ప్రశ్నను లేవనెత్తింది. ఉద్యోగం, చదువు పేరుతో వచ్చే యువతులను ఇలా అక్రమ వ్యాపారానికి ఉపయోగించుకోవడం అత్యంత దారుణం. నగరంలో ఎన్నో హాస్టళ్లు, పీజీలు ఉన్నాయి. వాటిలో నిజంగా విద్యార్థినులు ఉంటున్నారా, లేక ఇలాంటి అక్రమాలకు వాడుతున్నారా అనే అనుమానం ఇప్పుడు ప్రతి తల్లిదండ్రుల మనసులో మెదులుతోంది. తమ పిల్లలను హాస్టల్‌లో పెట్టిన తల్లిదండ్రులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. హాస్టల్‌లో చేరే ముందు, ఉద్యోగం పేరుతో ఎవరైనా పిలిచినా దాని గురించి పూర్తిగా తెలుసుకుని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 100 కు సమాచారం అందించాలని చెబుతున్నారు. ఎవరి వివరాలు చెప్పినా గోప్యంగా ఉంచుతామని హామీ ఇస్తున్నారు. ఈ కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దర్యాప్తు కొనసాగుతోంది. ఈ రాకెట్‌ను నడిపిన వారికి కఠిన శిక్ష పడాలని, బాధిత యువతులకు న్యాయం జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

CHANGE OF NAME

I, ASWITHA AITLA D/O BALARAJU AITLA (Old Name) Aadhaar Card Number 8107 1838 5889 hereby Changing my Name and henceforth in future I would be known as, ASHWITHA AITLA D/O BALARAJU AITLA (New Name) R/O H.No.2-112/B, Nimmapalli Village, Konaraopet Mandal, Rajanna Siricilla Dist – 505301, Telangana.

ASHWITHA AITLA
D/O BALARAJU AITLA

Place : Nimmapalli   Date : 31/10/2026

మూడేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది?

పోషించిన వ్యూహకర్తగా పేరు ఉంది. ఆయన బృందం ఇప్పటికే పలు జిల్లాల్లో ఫీల్డ్ వర్క్ ప్రారంభించిందని, సామాన్య ప్రజలు, వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలను, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, వ్యాపారులు అనే వర్గాల వారీగా ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పనితీరు గురించి ఈ సర్వేలో ప్రత్యేకంగా తెలుసుకుంటున్నట్టు సమాచారం. ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు, ఎక్కడ అసంతృప్తి ఉంది, ఎమ్మెల్యే ప్రజల్లోకి వెళ్తున్నారా లేదా అనే అంశాలను ఈ సర్వేలో పొందుపరుస్తున్నట్టు తెలుస్తోంది. అదే విధంగా ఏ మంత్రి శాఖపై ప్రజల్లో మంచి అభిప్రాయం ఉంది, ఏ శాఖపై విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి అనే విషయాలను కూడా ఈ సర్వేలో చేర్చినట్టు సమాచారం. అలాగే ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న సానుకూల, వ్యతిరేక అభిప్రాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే అంశాలపై కూడా ప్రశ్నలు అడుగుతున్నట్టు సమాచారం. పథకాల అమలులో జాప్యం, అర్హులకు అందకపోవడం, స్థానిక నాయకుల తీరు వంటి అంశాలపై కూడా ప్రజల నుంచి సమాచారం సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రతిపక్ష పార్టీల విమర్శలు ప్రజల్లో ఎంత మేరకు ప్రభావం చూపుతున్నాయి అనేది కూడా ఈ సర్వేలో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి.

ఈ సర్వే ఫలితాల ఆధారంగా ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపరచడం, ప్రజల్లో మంచి అభిప్రాయం పెంచేందుకు చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఈ సర్వేను చేయిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మూడేళ్ల పాలన తర్వాత ప్రజల్లో ఉన్న నిజమైన అభిప్రాయం తెలుసుకోవడం ద్వారా, రాబోయే రోజుల్లో పాలనపై, పార్టీపై కీలక నిర్ణయాలు తీసుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆ వర్గాలు అంటున్నాయి.

ముఖ్యంగా ఈ సర్వే ఫలితాల ఆధారంగా మంత్రివర్గంలో మార్పులు, నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష, అసంతృప్తి ఉన్న చోట సవరణ చర్యలు తీసుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అంతేకాకుండా రాబోయే స్థానిక ఎన్నికలు, భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా పార్టీని బలోపేతం చేసేందుకు ఈ సర్వే కీలకం కానుంది. ఈ సర్వేపై కాంగ్రెస్ పార్టీలోనే కాకుండా ప్రతిపక్ష పార్టీల్లో కూడా ఆసక్తి నెలకొంది. సర్వే ఫలితాలు బయటకు వస్తే ప్రభుత్వ బలహీనతలు, బలాలు స్పష్టమవుతాయని, దాని ఆధారంగా ప్రతిపక్షాలు తమ వ్యూహాలను మారుస్తాయని విశ్లేషకులు అంటున్నారు. మొత్తంగా మూడేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల తీర్పు ఏమిటి అనేది తెలుసుకోవడానికి రేవంత్ రెడ్డి చేపట్టిన ఈ రహస్య సర్వే పార్టీ భవిష్యత్ వ్యూహానికి దిశానిర్దేశం చేస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

సంపాదకీయం

ఇంట్లో మంట పెట్టనున్న ఎల్

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి.ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర వస్తువుల మీద కూడా పడుతుంది. అందువల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు, అందరూ సూపర్ ఎల్ నినోని తట్టుకుని బయటపడతారని అంటున్నారు. వచ్చే ఆరు నెలలు గడిస్తే మాత్రం మంచి రోజులు వచ్చినట్లే అని అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త.

సురక్షిత్ బచ్పన్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు బాలల హక్కులు, బాలల రక్షణపై అవగాహన కార్యక్రమాలు

వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర) :-వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి. పూజ అధ్యక్షతన నిర్వహిస్తున్న "సురక్షిత్ బచ్పన్ అభియాన్" ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పర్వతగిరి ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు బాలల హక్కులు, బాలల భద్రత, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ చైర్‌పర్సన్, వి.బి. నిర్మల గీతాంబ మాట్లాడుతూ "జాతీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల భద్రత, బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. పిల్లలు ఎలాంటి వేధింపులకు గురికాకుండా సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు, బాల్యవివాహాలు వంటి సామాజిక సమస్యలను అరికట్టేందుకు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పిల్లలు తమకు ఎదురయ్యే సమస్యలను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం ప్రతి విద్యార్థికి తన హక్కులపై అవగాహన కల్పించడం, బాలలపై జరిగే నేరాలను ముందుగానే గుర్తించడం, వాటిని నివారించడం మరియు పిల్లలు భయంలేని సురక్షితమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా చేయడం అని తెలియజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ కార్యదర్శి కందుకూరి పూజ మాట్లాడుతూ"సురక్షిత్ బచ్పన్ అభియాన్ యొక్క ముఖ్య ఉద్దేశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పాఠశాల స్థాయిలో పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమమని తెలిపారు. ముఖ్యంగా పోక్సో చట్టం, 2012 గురించి వివరించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ చట్టం కల్పించే రక్షణ, బాలలపై జరిగే లైంగిక నేరాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, బాధిత పిల్లలకు అందించే న్యాయ సహాయం గురించి వివరించారు. పిల్లలు తమపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా మౌనంగా ఉండకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి లేదా న్యాయ సేవాధికార సంస్థల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధిత పిల్లలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ఉపాధ్యాయుల బాధ్యత అని వివరించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు, మానసిక ఇబ్బందులు లేదా ఏవైనా వేధింపులకు సంబంధించిన సమస్యలు కనిపించినప్పుడు ఉపాధ్యాయులు వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, నిబంధనలపై ఉపాధ్యాయులు మరియు విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని తెలిపారు. పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ "బాలల భద్రతలో పోలీస్ శాఖ పాత్రను వివరిస్తూ, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. బాలలపై వేధింపులు, బాల్యవివాహాలు, అక్రమ రవాణా మరియు ఇతర నేరాలకు సంబంధించిన విషయాలను గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాను జాగ్రత్తగా ఉపయోగించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని తెలిపారు. షీ టీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు మాట్లాడుతూ "పాఠశాలలు, కళాశాలల్లో బాలికలు ఎదుర్కొనే వేధింపులు, ఈవ్ టీజింగ్, అసభ్యకర ప్రవర్తన వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీమ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను స్కిట్స్ రూపంలో వివరించారు. వివరించారు. సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ "ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు ఎదుర్కొనే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగం, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు, నకిలీ ఖాతాలు, వ్యక్తిగత ఫోటోలు మరియు సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి అంశాలను వివరించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయకూడదని, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. ఆన్‌లైన్‌లో ఏదైనా వేధింపులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా వరంగల్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఆర్.సురేష్, పి.శ్రీనివాస రావు, ఆర్.రజినీ, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, తెలంగాణ మోడల్ స్కూల్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పర్వతగిరి ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు బాలల హక్కులు, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధం, బాలలపై జరిగే లైంగిక నేరాల నివారణ, సైబర్ భద్రత, మహిళలు మరియు బాలికల రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకుల డిమాండ్

జనగామ, అక్టోబర్31(విజన్ ఆంధ్ర):జనగామ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి అనిజనగామ జిల్లా బీఎస్పీ నాయకులు జేరిపోతుల మల్లయ్య, చిలుముల అర్జున్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేరిపోతుల మల్లయ్య మాట్లాడుతూజనగామ జిల్లాలో ఈ వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బోరుబావుల్లో నీరు అడుగంటిపోయిందని ఇప్పటికే నాట్లు వేసిన వరి పంటలు నీరు లేక ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు అన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని, అనంతరంచిలుముల అర్జున్ మాట్లాడుతూవానాకాలంలో సరైన వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతులు, ఇప్పుడు యాసంగి పంటలు సాగు చేసుకోవడానికి కూడా నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు అని మరోవైపు వరి సాగుకు సరిపడా విద్యుత్ అందించలేమని, వరి నాట్లు వేయవద్దని ప్రభుత్వం చెబుతున్న పరిస్థితి రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కెనాల్ కాలువల ద్వారా జనగామ జిల్లాకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందించే పరిస్థితి లేకపోతే జనగామ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులకు కరువు సహాయక చర్యలు, పంట నష్టపరిహారం, ప్రభుత్వ సబ్సిడీలు అందించాలని కోరారు. వానాకాలం, యాసంగి రెండు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడితే రైతు కుటుంబాలు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జనగామ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

దర్యాప్తులో మరింత నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ప్రతి కేసులోనూ పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి

సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ దాఖలు, కోర్టు విచారణలో ఎలాంటి లోపాలు ఉండకూడదు

పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బందికి ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)నమోదైన ప్రతి కేసులో సమగ్రంగా, నాణ్యత ప్రమాణాలతో దర్యాప్తు చేపట్టి నేరస్తులకు చట్టప్రకారం శిక్షలు పడేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈరోజు పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం నందు ఏర్పాటుచేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసును ప్రాధాన్యతతో తీసుకొని, నేరం జరిగిన తీరు, నిందితుల పాత్ర, సంబంధిత సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగించాలని తెలిపారు. నేరస్తులకు శిక్షలు పడినప్పుడే బాధితులకు సరైన న్యాయం జరగడంతో పాటు ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందని పేర్కొన్నారు. దర్యాప్తు ప్రారంభం నుంచి కేసు విచారణ పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, సంఘటనా స్థల పరిశీలన, సాక్షుల వాంగ్మూలాల సేకరణ, సాంకేతిక మరియు ఇతర ఆధారాల సేకరణలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేసుకు సంబంధించిన ప్రతి ఆధారాన్ని చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సేకరించి భద్రపరచాలని, నిందితుల పాత్రను నిర్ధారించే విధంగా పకడ్బందీ దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా చట్టపరమైన లోపాలు లేకుండా పూర్తి వివరాలతో న్యాయస్థానానికి సమర్పించాలని, కోర్టు విచారణ సమయంలో సాక్షులు సక్రమంగా హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చిన్న చిన్న కేసులను సైతం నిర్లక్ష్యం చేయకుండా నేర స్వభావాన్ని బట్టి సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి, బాధితులకు అవసరమైన సహకారం అందిస్తూ, నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా ఆధారాలతో కూడిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచడం, పరిశోధనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడం, కోర్టు విచారణలో కేసులు నిలబడేలా పోలీస్ సిబ్బందికి అవసరమైన అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ స్టేషన్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, పోలీస్ స్టేషన్ రైటర్లు, సహాయక రైటర్లకు నేరుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్యాప్తు విధానాలు, కేసుల పరిశోధన, సాక్ష్యాధారాల ప్రాముఖ్యత, చార్జిషీట్ తయారీ, కోర్టు విచారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం నూతన విధానాలపై అవగాహన పెంచుకుంటూ, వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని, ప్రతి కేసులో నాణ్యతతో కూడిన దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సురేందర్, పట్టణ సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, రహీం పాషా, ప్రణయ్ ‾జ కుమార్, ఎస్ఐ వి. విష్ణువర్ధన్, పోలీస్ అధికారులు, స్టేషన్ రైటర్లు, సహాయక రైటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను నెరవేరుద్దాం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు తొడిగల సదానంద్ రెడ్డి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు చిత్రలేఖనము ఉపన్యాస పోటీలు నిర్వహించామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వికారాబాద్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు తొడిగల సదానంద్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను స్వామి వివేకానంద గురుకుల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్--2047 లక్ష్యాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దింటి నవీన్ కుమార్, పార్లమెంట్ నాయకుడు అమరేందర్ రెడ్డి, వికారాబాద్ మండల బీజేపీ అధ్యక్షుడు గౌండ్ల శివరాజ్ గౌడ్, నాయకుడు ప్రశాంత్ కుమార్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎన్జీవో పట్టణ అధ్యక్షుడిని సన్మానించిన టియుడబ్ల్యూజే నేతలు

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :31(విజన్ ఆంధ్ర)టీ ఎన్ జీ ఓ సంగారెడ్డి పట్టణ అధ్యక్షునిగా ఎన్నికయిన యాదవ రెడ్డి నిటి యూ డబ్ల్యూ జె, ఐ జె యూ సంగారెడ్డి జిల్లా నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి డిపిఆర్ఓ కార్యాలయం లో యాదవ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సంగారెడ్డి పట్టణ టిఎన్జీవో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు శనివారం యాదవ రెడ్డిని శాలువాతో సత్కరించారు. పూలమాలలు వేసి అభినందించారు. యాదవ రెడ్డి జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలపై నిత్యం సహకరిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. టీఎన్జీవోల కోసం సేవా దృక్పథంతో పనిచేయాలని జర్నలిస్టు సంఘం నేతలు పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హాజీ, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్,సంఘ నాయకులు మతీన్ , మసూద్, రఫిక్ నూరి, సత్తార్,రఫీముజాహిద్ , సత్యనారాయణ రెడ్డి, సిద్ధూ ,శ్రీనివాస్‌మహబూబ్ గౌరీశంషుద్దిన్ నాథిఖ్ తదితరులు పాల్గొన్నారు.

కొర్టా--చనాకా ప్రాజెక్టుపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలి

నాసిరకం పనులతో కాలువలు కూలిపోతున్నాయి..

ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే పాయల్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కొర్టా--చనాకా ప్రాజెక్టును సందర్శించి, ప్రాజెక్టు నిర్మాణ పనులను, కాలువల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన కొర్టా--చనాకా ప్రాజెక్టు కాలువలు నాసిరకం పనుల కారణంగా దెబ్బతింటూ, కూలిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ఒప్పందాలు, టెండర్లు, అంచనాలు, నిధుల విడుదల, పనుల అమలు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అప్పటి ప్రభుత్వంలో ఈ పనుల కేటాయింపు, అమలు, పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పాత్రను సైతం విచారణ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టాన్ని అధికారికంగా అంచనా వేసి, బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులు, ఇతరుల నుంచి నష్టపరిహారాన్ని రికవరీ చేయాలని స్పష్టం చేశారు. సుమారు రూ. 1,500 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ, కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉండటం, నిర్మించిన పనులు సైతం దెబ్బతినడం వల్ల రైతులకు ఆశించిన ప్రయోజనం అందడం లేదన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజాధన పరిరక్షణ దృష్ట్యా ముఖ్యమంత్రి ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి ఉన్నతస్థాయి విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. విచారణలో తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వెడమ రాము వర్ధంతిలో పాల్గొన్న ఐటీడీఏ పీఓ మకరందు ఎద్దులపాడులో స్మారక స్థలం వద్ద ప్రత్యేక పూజలు, నివాళులు

ఆసిఫాబాద్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ఎద్దులపాడు గ్రామంలో గిరిజన నాయకుడు వెడమ రాము 39వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ మంద మకరందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెడమ రాము స్మారక స్థలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామానికి చేరుకున్న పీఓకు గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం పీఓ మాట్లాడుతూ గిరిజన నాయకుల ఆశయాలను భావితరాలకు తెలియజేయాలని, గిరిజనులు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతి, ఆచార వ్యవహారాలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామంలోని తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గిరిజన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ కుటుంబానికి అండగా నిలిచినా దుర్గం శేఖర్

ఆర్థిక సహాయం అందజేత

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)గత నాలుగు నెలలుగా కాలుకు సెప్టిక్ అయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతి నగర్‌కు చెందిన చెర్లవార్ శ్రీనివాస్ కుటుంబానికి టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్ అండగా నిలిచారు. ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి లింగంపల్లి నర్సింలు ఈ విషయాన్ని దుర్గం శేఖర్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి శ్రీనివాస్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా తన తల్లి దుర్గం చిన్నుబయి జ్ఞాపకార్థంగా కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఎలాంటి అవసరమైనా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. అంతేకాకుండా, శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తగిన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా ఉ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ మేకల జితేందర్, పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి లింగంపల్లి నర్సింలు, నాయి బ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు దేగం వేణు, నయన్ వాంఖడే, ఆడే రఘు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే

ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బీఆర్ఎస్‌లోకి చేరిన గోయగావ్, లక్ష్మీపూర్ సర్పంచులు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర) వాంకిడి మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని గోయగావ్, లక్ష్మీపూర్ గ్రామాలకు చెందిన సర్పంచులు దుర్వా ఇసురు బాయి, కమ్మరి చిన్నుతో పాటు ఉప సర్పంచ్ టక్రే శ్రీనివాస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అజయ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు గడువు నవంబర్ 6 వరకు మాత్రమేవెంటనే నమోదు చేసుకోండి: ఎమ్మెల్యే నాయిని



హన్మకొండజిల్లా ప్రతినిది అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులందరికీ నా విజ్ఞప్తి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు చేసుకోవడానికి నవంబర్ 6వ తేదీ చివరి గడువు. సమయం చాలా తక్కువగా ఉన్నందున ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని పట్టభద్రులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరుతున్నాను. ఇప్పటికే చాలామంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో చదువుకున్న ప్రతి ఒక్కరి నిర్ణయం ఎంతో కీలకం. మీ ఓటు మీ గొంతుక. మీ ఆలోచన, మీ నిర్ణయం భవిష్యత్తు దిశను ప్రభావితం చేస్తాయి. కాబట్టి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నవంబర్ 6వ తేదీలోగా తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మీ ఓటు హక్కును వినియోగించుకోండి.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి.

అన్నారం షరీఫ్ గ్రామంలో పట్టభద్రుల ఓటరు నమోదు లో భాగంగా సమీక్షా సమావేశం

వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామం లో బీ ఆర్ ఎస్ పార్టీ మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు అన్నారం గ్రామం లో మాజీ పిఎసిఎస్ చైర్మన్ యం మనోజ్ గౌడ్ నివాసం లో బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు లో భాగంగా అన్నారం గ్రామం లో గాని పర్వతగిరి మండలం లో వివిధ గ్రామాలల్లో బీ.ఆర్. ఎస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా తిరుగుతూ డిగ్రీ చదువు పూర్తి ఐనా పట్టభద్రులను ఓటరుగా గుర్తించి వారిని స్వయంగా మీరే ఆన్లైన్ సెంటర్ వద్దకు తీసుకువెళ్లి పట్టభద్రుల ఓటరుగా నమోదు చేపించాలి అని బీ.ఆర్.ఎస్ పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో మాజీ కో ఆప్షన్ నెంబర్ షబ్బీర్ అలీ కర్ణాటక నర్సింగం యం డి పాషా ముంజంపెల్లి యాకాంభ్రం సముద్రాల వెంకన్న గద్దం యాకాంభ్రం సోమరాపు రాజు పస్తం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా భారత ఉక్కుమనిషి జయంతి వేడుకలు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లో, కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించిన జాతీయ ఐక్యత దినోత్సవం

భారతదేశ ఐక్యత సమగ్రత భద్రతను కాపాడుతానని జిల్లావ్యాప్తంగా ప్రతిజ్ఞ చేసిన సిబ్బంది

ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నివాళులర్పించిన పోలీసు అధికారులు సిబ్బంది

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారి ఆధ్వర్యంలో భారతదేశపు మొదటి హోం మంత్రి ఉక్కు మనిషిగా పేరుగాంచిన లిసర్దార్ వల్లభ్ భాయి పటేల్‌లి 151వ జయంతి వేడుకలను ఆయన చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పూలతో సత్కరించి జాతీయ ఐక్యత దినోత్సవం (ఏక్తా దివస్) గా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత దేశ స్వతంత్రానంతన ఏకీకృత దేశంగా రూపొందించడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అనిర్వచనీయమైనదని కొనియాడారు. భారతదేశ సార్వభౌమత్యం ఐక్యతను కాపాడే క్రమంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఆయనను భారతదేశపు ఉక్కుమనిషిగా నిలిపాయని తెలిపారు. అసమాన పోరాట ప్రతిమ ఉన్న స్వతంత్ర భారత యోధుడిగానే కాకుండా భారత దేశంలోని మొదటి హోం మంత్రిగా పనిచేసే స్వతంత్ర భారత దేశానికి సేవలందించారు. దేశంలోని అనేక సమస్యలను తనదైన పద్ధతిలో పరిష్కరించిన పటేల్ ఐక్యత భావనను ప్రతీకగా నిలిచారని ఇటువంటి మహనీయులను మనమంతా ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లో, కార్యాలయాల్లో ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞను చేశారు. అందులో భాగంగానే పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ఐక్యత దినోత్సవం ప్రతిజ్ఞను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో సహా, అధికారులందరూ చేసి జిల్లా ముఖ్య కార్యాలయ సిబ్బంది మరియు రిజర్వ్ సిబ్బంది పోలీసు సిబ్బంది పాల్గొని అనుసరించారు. ఈ ప్రతిజ్ఞలో లిభారత దేశ ఐక్యత సమగ్రత భద్రతను కాపాడుతానని సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనీయత మరియు చర్యల వల్ల సాధ్యమైన నా దేశాన్ని ఏకీకృతం చేయాలనే స్ఫూర్తితో నేను ప్రతిజ్ఞ చేస్తున్నానని, భారతదేశం యొక్క అంతర్గత భద్రతను ఎల్లవేళలా కాపాడుతూ ఉంటానని గంభీరంగా నిర్ణయించుకుంటున్నాను అని ప్రతిజ్ఞలి . ఈ కార్యక్రమంలో పోలీస్ ముఖ్య కార్యాలయం ఏవో శివకుమార్, సూపరిండెంట్లు సులోచన, సంజీవ్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి, ఎన్ చంద్రశేఖర్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ నైలు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు గోపికృష్ణ, గబ్బర్ సింగ్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకోవాలి - ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి బ్యూరో అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర)సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. దేశ ఐక్యత, సమగ్రత, అంతర్గత భద్రత పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర అన్నారు. భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని శనివారం కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ ఐక్యత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక సంస్థానాలను ఏకం చేసి సమైక్య, బలమైన భారతదేశ నిర్మాణానికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన దృఢ సంకల్పం, నాయకత్వ లక్షణాలు, దేశం పట్ల అచంచలమైన నిబద్ధత నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం, అంతర్గత భద్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలుగుతూ దేశ అభివృద్ధి, శాంతిభద్రతలు, సామాజిక సామరస్యానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజల భద్రతతో పాటు దేశ అంతర్గత భద్రత పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కే. నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తులను స్మరించుకుందాం, అమర పోలీస్ వీరులకు నివాళులర్పిద్దాం

పోలీస్ సంస్మరణ దినం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవాలి-- జిల్లా ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర)రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ అని, మనం చేసే ఒక్క యూనిట్ రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం కల్పిస్తుందని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ అన్నారు. ఈరోజు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పాల్గొని రక్తదానం చేస్తున్న యువత, పోలీస్ సిబ్బందిని అభినందించారు. యువతతో పాటు జిల్లా పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా మిత్రులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మొత్తం 400 మంది రక్తదానం చేయగా, 400యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆసిఫాబాద్ , రిమ్స్ ఆదిలాబాద్ ఆసుపత్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సలు, ప్రసవ సమయంలో, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించడం ఎంతో కీలకమని తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ నిర్దిష్ట వ్యవధిలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజానికి విలువైన సేవ అందించవచ్చని పేర్కొన్నారు. పోలీస్ శాఖ కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుందని తెలిపారు. రక్తదానం పట్ల యువతలో మరింత అవగాహన పెంపొందించాలని, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే మానవతా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానంలో భాగస్వాములై ప్రాణదాతలుగా నిలిచిన అందరినీ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ అభినందించారుఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ గారి ఆశయాలు, త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం : డాక్టర్ నరేష్ జాదవ్

ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల తో కలిసి ఘన నివాళులు అర్పించిన డీసీసీ డా నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)ఛలో ఢిల్లీ -- ఓట్ బచావో, దేశ్ బచావో" కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నుంచి ఢిల్లీకి చేరుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ నాయకత్వంలో ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ స్వర్గీయ ఇందిరా గాంధీ దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకురాలని కొనియాడారు. దేశ ప్రధానిగా ఆమె తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ముఖ్యంగా ఇందిరా గాంధీ తీసుకున్న బ్యాంకుల జాతీయకరణ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు అని గుర్తుచేశారు. అప్పటివరకు కేవలం కొద్దిమంది సంపన్నులకే పరిమితమైన బ్యాంకింగ్ వ్యవస్థను, సాధారణ ప్రజలకు, రైతులకు, చిన్న వ్యాపారులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆమెదేనని కొనియాడారు. 'గరీబీ హటావో" నినాదంతో భూ సంస్కరణలు అమలు చేసి, భూమి లేని నిరుపేదలకు, దళితులకు వేలాది ఎకరాల భూములను పంపిణీ చేయడం ద్వారా గ్రామీణ పేదల జీవితాల్లో ఆమె వెలుగులు నింపారని అన్నారు .దేశ ఐక్యత, సమగ్రత కోసం ఇందిరా గాంధీ చేసిన త్యాగం అసమానమైనదని, ఆమె ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం నిలబడిన ధైర్యసాహసాలు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి రాజకీయ పరిస్థితుల్లో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం ఇందిరా గాంధీ ఆశయాలకు అనుగుణంగా కొనసాగుతోందని తెలిపారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి ఓటు విలువను కాపాడుకోవడం మనందరి కాంగ్రెస్ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ , డాక్టర్ వెన్నెల గద్దర్ లతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం

-- మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ జిల్లా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 6.0 కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛత అనేది కేవలం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి ఆచరించాల్సిన సామాజిక బాధ్యత అని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని, ముఖ్యంగా చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వరుసగా ఆరవ సంవత్సరంలో ఇలాంటి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని, స్వచ్ఛతపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలు, బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛతను ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తో పాటు విద్యానగర్ వార్డు కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమైక్య భవన నాణ్యత నిర్మాణ లోపాలు

మూడు పిల్లర్ల వద్ద కుంగిన బేస్మిట్ పిల్లర్ల గుంతలను రాళ్ళు, మట్టితో బలంగా పూడ్చకపోవడం

కేవలం మట్టితో పూడ్చడం వలన బేస్మిట్ కుంగుబాటు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : డ్వాక్రా సంఘాల మహిళలందరూ ఒకే చోట కూర్చుని తమ సాధక బాధకాలను చర్చించుకుని పురోగతికి ప్రణాళికలు వేసుకొనుటకు డ్వాక్రా భవనం ఎంతగానో దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వం విబిజి రాంజీ ద్వారా పక్కా డ్వాక్రా భవనాల నిర్మాణం కొరకు అవసరమగు నిధులను మంజూరు చేస్తుంది. డ్వాక్రా భవనం నిర్మాణానికి టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తారు. టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ భవన నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంటుంది. భవన నిర్మాణంలో భాగంగా బేస్మిట్ గట్టిగా ఉండే విధంగా నిర్మాణం చేపట్టాలి. వికారాబాద్ మండల పరిధిలోగల బురాన్ పల్లి గ్రామంలో వి బి జి రాంజీ 10 లక్షల నిధులతో మహిళా సమైక్య భవనం నిర్మాణం పనులు చేపట్టారు. బేస్మిట్ నిర్మాణం చేసే దశలోనే మూడు పిల్లర్ల దగ్గర బేస్మిట్ కుంగిపోయింది. ప్రజల సొమ్మును భూమి పాలు చేయడం ఎంతవరకు సమంజసమని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిఘా లోపం వల్లనే నాణ్యత ప్రమాణాలు లోపించాయని గ్రామ ప్రజలు ధ్వజమెత్తారు. బేస్మిట్ కుంగిన విషయాన్ని బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రాందాస్ నాయక్ వివరణ కోరగా ఆయన స్పందిస్తూ బేస్మిట్ నిర్మాణాన్ని పకడ్బందీగా నిర్మించాలని కాంట్రాక్టర్ కు సూచించానని తెలిపారు. నిర్మాణంలో నాణ్యత లోపాలు రాకుండా చూసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. బేస్మిట్ నిర్మాణం సక్రమంగా లేకపోతే భవనం కుప్పకూలే ప్రమాదం ఉంటుందని కాంట్రాక్టర్ కు హెచ్చరించానని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టర్ యాసిన్ స్పందిస్తూ బేస్మిట్ నిర్మాణం పనులు ప్రారంభ దశలో ఉన్నాయని ఆయన తెలిపారు. పిల్లర్ల కొరకు తవ్విన గుంతల్లో ఎక్కువగా మట్టి ఉండడంతో బేస్మిట్ కుంగిపోయి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కుంగిన బేస్మిట్ స్థలములో మళ్లీ తవ్వి రాళ్లు మట్టి వేసి గట్టిగా చేసిన తర్వాతనే బేస్మిట్ నిర్మాణం చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. కట్టిన బేస్మిట్ కు నీళ్లు పట్టాల్సిన వ్యక్తి భవనం నిర్మాణం చేపట్టే స్థలము లోపల మట్టి ఉండడంతో ఎక్కువ నీరు పట్టడం వలన బేస్మిట్ కుంగిపోయిందని ఆయన వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. బురాన్ పల్లి గ్రామ ప్రజల విశ్వాసాన్ని చురగొంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అదే గ్రామంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం మండల పరిధిలోనే అత్యధిక నాణ్యత ప్రమాణాలను పాటించి నిర్మించానని తెలిపారు.

దివ్యాంగులు సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర)దివ్యాంగులకు ఉచితంగా అందించిన సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్- కాగజ్ నగర్ ఆధ్వర్యంలో జైపూర్ ఫూట్ క్యాంప్ గోడ ప్రతులను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్ వారు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, కృత్రిమ చేతులు, ఊత కర్రలు, నడక సహాయకాలు, ఆర్థోపెడిక్ బూట్లు, సహాయ బెల్టులు, వినికిడి పరికరాలు, ఇతర సహాయ ఉపకరణాలను అందిస్తున్నారని, వీటిని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్- కాగజ్ నగర్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

107 సంవత్సరాలుగా కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా

ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి

ఘనంగా ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

హనుమకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): 107 సంవత్సరాలుగా కార్మికులకు అండగా ఏఐటీయూసీ జెండా ఉందని ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి అన్నారు. శనివారం ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ జంక్షన్ లోని డబ్బాలు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట బిక్షపతి హాజరై ఏఐటీయూసీ అరుణ పతాకాన్ని ఎగర వేశారు. అనంతరం తోట బిక్షపతి మాట్లాడుతూ ఈ దేశంలో స్వాతంత్రానికి పూర్వం 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు కార్మికుల పక్షాన పోరాటం చేసిన ఏకైక, మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, స్వాతంత్ర అనంతరం పాలకవర్గాలు అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించి 8 గంటల పనివిధానం, 44 రకాల కార్మిక చట్టాలను సాధించిన ఘనత ఎఐటియూసి దని, ఈ దేశంలో కార్మికులకు ఉద్యోగ భద్రత అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం కావాలని పోరాటం చేసింది ఏఐటీయూసీ అన్నారు. కార్మిక వర్గం పోరాటాలతో సాధించుకున్న చట్టాలు మోదీ అవలంబించే కార్పొరేట్ల అనుకూల విధానాల వలన కార్మిక రంగం ప్రమాదంలో పడిందని, ఈ నేపథ్యంలో కార్మికులు సంఘటిత ఉద్యమాలతో హక్కుల రక్షణ కోసం కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పూజారి అమృతయ్య, పొనుగోటి రాముగోపాల్ చారి, కోడేపాక బాబు, కేతపాక ప్రసాద్, పూజారి నరేందర్, మామునూరి దామోదర్, తిప్పనపల్లి మోహన్, లక్కం రాజు, జెట్టి కృష్ణ, రాయబారపు శ్రీనివాస్, రెసోజు రాజు, పెనుకుల మధు, నాటెంకి కుమారస్వామి, వీణవంక రాజు, బానోత్ హుస్సేన్, బానోత్ సుమలత, వెన్నెల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తిప్పరోని కుంట బండ్ అభివృద్ధి పనులను త్వరగా మొదలుపెట్టాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, చాహత్ బాజ్ పాయి

మున్సిపల్, సాగునీటిపారుదల, సర్వే అధికారులతో కలిసి బండ్ అభివృద్ధి పనులు చేపట్టనున్న తిప్పరోని కుంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి

హనుమకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్ లోని తిప్పరోని కుంట చెరువు కట్టపై చేపట్టనున్న బండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం మున్సిపల్, సాగునీటిపారుదల, సర్వే అధికారులతో కలిసి బండ్ అభివృద్ధి పనులు చేపట్టనున్న తిమ్మాపూర్ తిప్పరోని కుంటను హనుమకొండ జిల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, పరిశీలించారు. ఈ సందర్భంగా కుంట కట్ట ప్రారంభం నుండి చివరి వరకు ఉన్న కట్ట విస్తీర్ణాన్ని పరిశీలించారు. కుంట విస్తీర్ణం, చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలను మున్సిపల్, సాగునీటిపారుదల, సర్వే అధికారులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... తిప్పరోని కుంట కట్ట బండ్‌పై ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వివిధ రకాల మొక్కలతో ప్లాంటేషన్ చేపట్టాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే బండ్‌పై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, కట్ట సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు, వాకింగ్ కు ఉపయోగపడేవిధంగా అందుబాటులోకి వచ్చేలా అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్, సాగునీటిపారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డిఈ మధుసూదన్ రెడ్డి, సర్వేయర్ సందీప్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన -- ఎంపీడీవో ఆర్ కృష్ణయ్య

అయిజ అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కిష్టాపురం గ్రామపంచాయతీలో ఇవాళవికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ పథకము ద్వారా కిష్టాపురం గ్రామ సర్పంచ్ కుమ్మరి జయమ్మ నరేష్ సూచనలతో గ్రామ రైతు పోలంలో ఫామ్ బండ్ ఏర్పాటు చేస్తున్న ఫామ్ బండ్ ను ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీ ఓ మనోహర్,సర్పంచ్ భర్త కుమ్మరి నరేష్ ఉపసర్పంచ్ రవికుమార్ పంచాయతి సెక్రటరీ ఆంజనేయులు కలిసి పనులను పరిశీలించారుఎంపీడీవో మాట్లాడుతూ,ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, బోర రీచార్జ్ పనులు వంటి అన్ని జలసిరి పనులు చేపట్టాలని సూచించారు.

జర్నలిస్టులు , న్యాయవాదులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూస్తే సహించేది లేదు. తాటికంటి రవికుమార్

భూపాలపల్లి జిల్లా 31 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో న్యాయవాదులు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికంటి రవికుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, అధికారులను ప్రశ్నిస్తున్న జర్నలిస్టులు, ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తున్న న్యాయవాదులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని ఆయన అన్నారు.జిల్లాలో అధికార దురహంకారంతో ప్రశ్నించే గొంతులను అణచివేయాలని ప్రయత్నించడం సరైన విధానం కాదని, ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రజాసేవ కోసం వినియోగించాలే తప్ప వ్యక్తిగత కక్షలు, బెదిరింపులు, దాడులకు పాల్పడేందుకు కాదని స్పష్టం చేశారు. జర్నలిస్టులు సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తుంటే వారిపై దాడులు చేయడం భావప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు.అదేవిధంగా న్యాయవాదులపై దాడులు జరగడం న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధ్యులెవరైనా సరే రాజకీయాలకు అతీతంగా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జిల్లా పోలీసు యంత్రాంగం ఈ ఘటనలను అత్యంత తీవ్రంగా పరిగణించి బాధితులకు తగిన రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ప్రజాప్రతినిధులు, ఇతర వ్యక్తుల వ్యవహారాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని సూచించారు.జర్నలిస్టులు, న్యాయవాదులు భయంలేకుండా తమ విధులు నిర్వహించుకునే వాతావరణాన్ని ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పించాలి. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరఫున డిమాండ్ చేశారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

దేశ సమగ్రత, ఐక్యతకు ఇద్దరు మహనీయుల సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : భారత మాజీ ప్రధాని, భారత ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాని, భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను శనివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత, ఐక్యత కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఇద్దరు మహనీయులను ఒకే రోజు స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. వందలాది సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి అఖండ భారత నిర్మాణానికి పునాది వేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో ఆయన చూపిన దృఢ సంకల్పం, నాయకత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు.అదేవిధంగా ఇందిరా గాంధీ దేశాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు. 'గరీబీ హటావో' నినాదంతో పేదల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు బ్యాంకుల జాతీయీకరణ, భూసంస్కరణలు వంటి కీలక నిర్ణయాలతో సామాజిక, ఆర్థిక రంగాల్లో మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన ఇందిరా గాంధీ సేవలు, త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
మహనీయుల ఆశయాలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. హనుమకొండ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళి, వరంగల్ ఎనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, మాజీ కార్పొరేటర్లు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి వేడుకలు

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఐక్యతా ప్రతిజ్ఞ

దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని...

జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలి

కలెక్టర్ సి నారాయణరెడ్డి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31, (విజన్ ఆంధ్ర): దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకిత భావంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు.శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో భారత ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలిచారని, స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశాన్ని ఐక్యంగా, బలంగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నాయకత్వం, దూరదృష్టి, దేశభక్తి చిరస్మరణీయమని అన్నారు.దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పోషించిన కీలక పాత్రను, స్వాతంత్ర్యం అనంతరం దేశ సమైక్యత కోసం చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిస్తూ, దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యతకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిచే దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, ప్రజల మధ్య సోదరభావం, సామరస్యం, ఐక్యతను పెంపొందించేందుకు కృషి చేస్తామని జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భర్తను కోల్పోయిన మహిళలకు తక్షణ ఆర్థిక భరోసా

గద్వాల అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర బ్యూరో)పింఛన్ లబ్ధిదారుడైన భర్త మరణించినప్పుడు ఆయన భార్యకు తక్షణ పెన్షన్ అందించే ఇన్స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు.పెన్షన్ పొందుతున్న భర్తలు మరణించిన సందర్భాల్లో వారి భార్యలకు తక్షణమే సామాజిక భద్రతా పెన్షన్ మంజూరు చేసే ఇన్స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని ప్రభుత్వం మరిన్ని పింఛన్ కేటగిరీలకు విస్తరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారశీ,వృద్ధాప్య పింఛన్‌తో పాటు దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ (యాంటీ రెట్రోవైరల్ థెరపీ), ఫైలేరియా పింఛన్ లబ్ధిదారుల భార్యలకు కూడా ఇన్స్టంట్ పెన్షన్ సదుపాయాన్ని తాజాగా ప్రభుత్వం విస్తరించిందన్నారు. జీవిత భాగస్వామిని కోల్పోయిన మహిళలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా కుటుంబానికి అందుతున్న సామాజిక భద్రత సహాయం నిలిచిపోకుండా కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మరణించిన పురుష పెన్షన్ లబ్ధిదారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే వితంతు పెన్షన్, 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలోని బిల్ కలెక్టర్‌కు దరఖాస్తుతో పాటు తమ ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛన్ లబ్ధిదారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ సమర్పించాలని సూచించారు. సంబంధిత అధికారులు అర్హులైన వారు

సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతను ధ్రువీకరించిన అనంతరం చేయూత పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి నిబంధనల ప్రకారం పెన్షన్ మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ఇందుకోసం ప్రత్యేక దరఖాస్తు గడువు లేదా నిర్దిష్ట విడత కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మరణించిన పెన్షన్ లబ్ధిదారుల కుటుంబాల వివరాలను సకాలంలో సేకరించి, నిర్దేశించిన 15 రోజుల గడువులోగా చేయూత పోర్టల్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన మహిళలకు సామాజిక భద్రతా పెన్షన్లు నిరంతరాయంగా అందేలా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. భర్తను కోల్పోయిన మహిళలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించే ఈ సదుపాయాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఇందిరా గాంధీ వర్ధంతి

ఘన నివాళులు అర్పించిన చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర):ఈరోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ సెంటర్లో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ ఈ సందర్భంగా ఇందిరా గాంధీ గారు దేశానికి అందించిన సేవలను, దేశ ఐక్యత కోసం చేసిన కృషిని, ప్రజల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాలను స్మరించుకున్నారు. దేశ అభివృద్ధి కోసం ఆమె చూపిన ధైర్యం, నాయకత్వ పటిమ, ప్రజాసేవ పట్ల అంకితభావం నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.దేశ సమగ్రత, సమైక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఇందిరా గాంధీ గారి ఆశయాలు, ఆదర్శాలు చిరస్మరణీయమని కొనియాడుతూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు. భారతదేశ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ఇందిరా గాంధీ గారి సేవలు చిరస్మరణీయం.ఈ యొక్క కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ భూక్యా వెంకట్, కాంగ్రెస్ పార్టీ పలు వార్డుల కౌన్సిలర్లు, నీరుటి లక్ష్మీనారాయణ, నిమ్మల శ్రీనివాస్, బానోత్ భాస్కర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, జిన్నా రెడ్డి వెంకటేశ్వర్లు, ఎడ్ల రమేష్, నాళ్ల నరసింహారావు, గిరిధర్ గుప్తా, సీనియర్ నాయకులు రాజు గౌడ్, హరూన్ గారు, లక్ష్మి, విజయ,శ్రీను, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు కార్యకర్తలు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు...

ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి వేడుకలు

సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ

హనుమకొండ జిల్లా ప్రతినిది అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) దేశ ప్రజలందరి ఏకత్వానికి ప్రతిరూపమే జాతీయ ఐక్యతా దినోత్సవం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో దేశ తొలి ఉప ప్రధానమంత్రి, భారత దేశ ఉక్కుమనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. జాతీయ ఐక్యతా స్ఫూర్తిని పెంపొందిస్తూ దేశ సమగ్రతను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు.అనంతరం జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీ శంకర్, తహసీల్దార్లు, ఇతర అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో నవంబర్ 1, 2 తేదీల్లో మళ్లీ కంటి పరీక్షలు

లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ వద్ద రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం

కాగజ్‌నగర్. అక్టోబర్31 (విజన్ ఆంధ్ర): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ వద్ద వైద్య సేవలందిస్తున్న లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా పండుగ సమయంలో కంటి పరీక్షలు నిర్వహించడంతో పలు కారణాల వల్ల చాలామంది రోగులు వైద్య సేవలను పొందలేకపోయారని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని నవంబర్ 1, 2 తేదీల్లో మరోసారి రెండు రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కంటి చూపు మందగించినవారు, కంటి సమస్యలతో బాధపడుతున్నవారు, శస్త్రచికిత్సలు అవసరమైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ వద్దకు వచ్చి వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు.

సిపిఐ నేత మేకల రవికి కన్నీటి వీడ్కోలు

ముగ్గురికి జాతీయ ఐక్యత అవార్డులు–26 ప్రదానం

హైదరాబాద్, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మడిగాల విజయభాస్కర్ రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, నయ్యద్ అబ్దుల్ ముతకబీర్‌లకు జాతీయ ఐక్యత అవార్డు–2026 ప్రదానం చేశారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ శాసనమండలి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా.బండ ప్రకాష్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ ఐక్యతకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమానికి కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అధ్యక్షత వహించగా, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, న్యాయవాది మహమ్మద్ అక్బర్ సిద్దిఖీ, కుంబర్తి రవీంద్ర, మీగడ సప్త రాజేష్, హలో ఈసిస్ ధీర్, జి.వేణుగోపాల్, బిచ్చుకారి సూర్య తదితరులు పాల్గొన్నారు.

కూనంనేని, తక్కళ్లపల్లి, ఈటి నర్సింహ, ఎమ్మెల్యే నాయిని నివాళులు

మేకల రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావు

వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవికి శనివారం వరంగల్ నగరంలో కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం మేకల రవి అనారోగ్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందగా శనివారం వరంగల్ లో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. వరంగల్ నగరంలోని శివ నగర్ లో గల మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయాన్ని ఉంచగా వందలాది మంది ప్రజలు, సిపిఐ కార్యకర్తలు తరలి వచ్చి నివాళులు అర్పించారు.అంత్యక్రియల సందర్భంగా దారి పొడవునా మేకల రవి అమర్ రహే.. మేకల రవి ఆశయాలను కొనసాగిస్తాం అంటూ నినాదాలు చేశారు. పేదల సమస్యల పరిష్కారం కోసం, గుడిసె వాసులకు ఇండ్ల స్థలాల కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. మేకల రవి మృతి వార్త తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నర్సింహ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

రాజేందర్ రెడ్డి తదితరులు వరంగల్ శివ నగర్ కు చేరుకుని రవి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రవి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో సిపిఐ వరంగల్,హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు ఎస్ కె బాష్ మియా, కర్రె బిక్షపతి, బి. విజయ సారథి, సిహెచ్ రాజారెడ్డి, కొరిమి రాజ్ కుమార్,మంద పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి. వెంకట్రాములు, తమ్మెర విశ్వేశ్వరరావు, మోతె లింగారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్,వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.మేకల రవి మృతి సిపిఐకి తీరని లోటు : కూనంనేని సాంబశివరావుసిపిఐ నాయకులు మేకల రవి అకాల మృతి ప్రజా రంగానికి పార్టీకి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మేకల రవి భౌతిక కాయం వద్ద నివాళులు అర్పించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ మేకల రవి జీవితాంతం పేదల సంక్షేమం, కార్మికుల హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే శ్రమించారని అన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ పోరాటాలు నడిపిన నిజాయితీ గల నాయకుడు మేకల రవి అని తెలిపారు. ?ఆయన ఆశయాలు, చూపిన బాట ఎప్పటికీ ఆదర్శనీయమైనవని, వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తున్నానని, వారి కుటుంబానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. నివాళులు అర్పించిన వివిధ పార్టీల నాయకులువరంగల్ శివ నగర్ లోని మేకల రవి స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయాన్ని వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. సిపిఎం నాయకులు ఎస్. వాసుదేవ రెడ్డి, జి. ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ రంగయ్య, రత్నమాల, ఎంసిపిఐ(యు) నాయకులు ఎన్ రెడ్డి హంసా రెడ్డి, పెద్దారపు రమేష్, గద్దం నాగార్జున, బీఆర్ఎస్ నాయకులు జన్ను జకార్య, టిడిపి కార్యదర్శి చుంచు రాజేందర్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం " సమ్ శోధిని'26" గ్రాండ్ వాలెడిక్టరీ

హనుమకొండజిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) కిట్స్ వరంగల్ లో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ యస్ టి ఇ) కిట్స్ స్టూడెంట్ విద్యార్థి చాప్టర్, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఒ సైన్స్, వరంగల్ (కిట్స్ డబ్ల్యు)వారి యొక్క టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్)తో పాటుగా 11 విభాగాలు సంయుక్తంగా జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం యొక్క "సమ్ శోధిని'26" అక్టోబర్ 30 నుండి 31, 2026 రెండు రోజుల టెక్ ఫెస్ట్ నిర్వహించబడింది అని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు. ఈరోజు, కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని సిల్వర్ జుబ్లీ సెమినార్ హాల్‌లో దాని వైభవోత్సవం విజయవంతంగా నిర్వహించబడింది అని తెలిపారు. ఈ సందర్భంగా ఫార్మర్ రాజ్యసభ ఎంపీ, కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు ఒ కోశాధికారి శ్రీ పి. నారాయణ రెడ్డి ఒ హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే ఒ కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రటరీ, వి. సతీష్ కుమార్ గారు కార్యనిర్వాహక సాక్ అధ్యాపక బృందం, అధ్యాపక సమన్వయకర్తలు మరియు విద్యార్థి సమన్వయకర్తల బృందాన్ని ఇంజినీరింగ్ ఒ యం బి ఎ విద్యార్థి నీ విద్యార్థుల ప్రయోజనం కోసం విద్యార్థి సాంకేతిక సింపోజియం "సమశోధిని'26" విజయవంతంగా నిర్వహించినందుకు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో అర్థవంతమైన మార్పును తీసుకురావడంలో వినూత్న ఆలోచనల శక్తిని నొక్కి చెప్పే "సాంప్రదాయ ఆలోచనలకు అతీతంగా" అనే ఇతివృత్తానికి అనుగుణంగా సంశోధిని'26 సమర్థవంతంగా నిర్వహించబడిందని హైలైట్ చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సింపోజియంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్

-- నెట్‌వర్క్స్ (సిఎస్ యన్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ -- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సిఎస్ ఎం), సివిల్ ఇంజనీరింగ్ (సి ఈ), మెకానికల్ ఇంజనీరింగ్ (ఎం ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈ సి ఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈ ఈ ఈ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సిఎస్ ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ -- వి ఎల్ ఎస్ ఐ (ఈ సి ఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ టీ), మరియు యం బి ఎ తో సహా పదకొండు అకడమిక్ విభాగాల నుండి చురుకైన భాగస్వామ్యం కనిపించిందని ఆయన సగర్వంగా తెలిపారు. అంతే కాకుండా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇన్నోవిజన్, ట్రెజర్ హంట్, 50 పై చిలుకు సాంకేతిక కార్యక్రమాలను నిర్వహించామని ఆయన తెలిపారు. ప్రతిష్టాత్మక సిద్ధంగా ఉన్న ఇంజినీర్లకు అధిక సిటిసి ఉపాధిని సాధించడానికి విద్యార్థుల ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ –ఐ స్పేస్ ఆర్‌ఈ సంస్కృతి పట్ల మక్కువ కలిగి ఉండాలని ఆయన తెలిపి ముగించారు. ఫెస్ట్ కన్వీనర్ మరియు డీన్ విద్యార్థి వ్యవహారాల ప్రొఫెసర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ సింపోజియం ప్రయోజనంని హైలైట్ చేస్తూ, ఈ సింపోజియం విద్యార్థి సమాజానికి ఖచ్చితంగా ప్రయోజనం చేకూరుస్తుందని, సమాజ ప్రయోజనాల కోసం సృజనాత్మక ఆలోచనలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. సింపోజియం ప్లాట్‌ఫారమ్ వైవిధ్యభరితమైన ఇంజనీరింగ్ మరియు సాంకేతిక రంగాలలో ప్రతిభను మరియు నైపుణ్యాన్ని ప్రదర్శించింది మరియు పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్లను రూపొందించడంలో ఉత్సాహాన్ని ప్రదర్శించింది అని డీన్ సగర్వంగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ యాజమాన్య సభ్యులు, కిట్స్ వరంగల్ (2026 బ్యాచ్) పూర్వ విద్యార్థుల వీటా క్యూర్ పరిశ్రమ (హెల్త్ కేర్), మంచిసంబ్ల రితివిక్ ఒ భరద్వాజ్ సంగర్స్ వ్యవస్థాపకులు, డీన్‌లందరూ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ ఒ ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ కె. శ్రీధర్, ఐ యస్ టి ఈ కిట్స్ చాప్టర్ చైర్మన్ మరియు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, డా. బి. మధుకర్ రెడ్డి, కో–కోఆర్డినేటర్స్, డాక్టర్ ఎస్. సునీల్ ప్రతాప్ రెడ్డి ఒ బి. శశికాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ కెమిస్ట్రీ మరియు పిఆర్ఓ డా.డి. ప్రభాకర చారి, డీన్‌లందరూ, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, ఐయస్ టిఈ కిట్స్ విద్యార్థి చాప్టర్ ప్రెసిడెంట్ కె. సాయి సిద్దార్థ రెడ్డి, టెక్నికల్ క్లబ్ విద్యార్థి అధ్యక్షుడు నిఖిల్ మాదరవేని, 4500 మందికి పైగా విద్యార్థులు ఈ ఘన విజయం కోసం చురుకుగా పాల్గొన్నారు.

భారతదేశ ఐక్యతలో భాగస్వాములం అవుదాం

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31: (విజన్ ఆంధ్ర)భారతదేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సర్దార్ వల్లభ భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న భాషలు, విభిన్న సంస్కృతులు కలిగి ఉన్న దేశమని, ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ఐక్యతకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. దేశ భద్రతను కాపాడేందుకు, అంతర్గత భద్రతను రక్షించేందుకు ప్రజలందరూ కలిసి రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని కల్పించి రోజుకు ఎనిమిది వందల రూపాయలు కూలి చెల్లించాలి

మద్దెల ఎల్లేష్ హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి

ధర్మసాగర్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులు తీసుకురావడానికి గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి రద్దు చేసే దుర్మార్గ చర్యల్ని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ హనుమకొండ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ తీవ్రంగా విమర్శించారు ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పిస్తూ రోజుకు 8 వందల కూలి చెల్లించాలని డిమాండ్ చేసినారు శనివారం రోజు ధర్మసాగర్ మండల కేంద్రంలో మండల సిపిఐ కార్యదర్శి కొట్టె వెంకటేష్ అధ్యక్షతన ఏఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగినది ముందుగా మరి పెల్లి అంకుష్ ఎర్ర జెండా ఆవిష్కరించడం జరిగినది అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అత్యంత సంపన్నులపై నాలుగు శాతం పన్ను విధించి కార్మికుల సంక్షేమం కోసం బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలన్నారు లాభం పేరుతో పెట్టుబడిదారీ వర్గం శ్రామిక వర్గం యొక్క శ్రమ శక్తిని దోచుకుంటుందని ధ్వజమెత్తారు పెట్టుబడిదారీ వ్యవస్థకు గోరి కట్టి ఒక్క శాతంగా ఉన్న పెట్టుబడిదారీ వర్గాన్ని 99% ఉన్న కార్మిక వర్గం వర్గ పోరాటంతో దోపిడీ పెట్టుబడిదారీ కోటల్ని కూల్చడం అని వార్నమన్నారు ఈ కార్యక్రమంలో కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మాలో శంకర్ మాజీ సిపిఐ కార్యదర్శి మునిగాల బిక్షపతి బి కే యం యు నాయకులు బొట్టు బిక్షపతి కొట్టె లింగయ్య వల్లపు సారయ్య భూక్యసర్వరూప సింగారపు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

అయోధ్య పురములో నిర్మాణమైన రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూనిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి

మద్దెల ఎల్లేష్ నేదునూరి రాజమౌళి

కాజీపేట అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): పారిశ్రామిక అభివృద్ధి పేరుతో హన్మకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు రైతుల భూములను ఇచ్చినటువంటి రైతాంగానికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేయడం జరిగిందని భారత కమ్యూనిస్టు పార్టీ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ ధ్వజమెత్తారు శనివారం రోజున కాజీపేట మండల కేంద్రంలో కందాల దాబా వద్ద ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ 107 వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది సమావేశానికి ముందు ఏఐటియుసి జెండాను నేదునూరి రాజమౌళి ఆవిష్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ దేశ కార్మిక వర్గాన్ని భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకొనుటకు కార్మిక వర్గం విరోచిత పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ ప్రైవేటు రంగ పరిశ్రమలలో రిజర్వేషన్లు పాటిస్తూ సామాజిక న్యాయానికి దోహదపడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాజీపేట మండల సిపిఐ కార్యదర్శి మాలోత్ శంకర్ మాజీ మండల కార్యదర్శి మునిగాల బిక్షపతి బి కే ఎం యు నాయకులు బొట్టు బిక్షపతి మేస్త్రీల సంఘ నాయకులు రసమల్ల కుమార్ బుడి స్వామి మునిగాల సిపిఐ సీనియర్ నాయకులు మునిగాల ఐలయ్య లక్ష్మీ దేవేంద్ర వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు

వెడమ రాము 3రవ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐటీడీఏ పీఓ మంద మకరందు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర)ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని ఎద్దుపాడు గ్రామంలో నిర్వహించిన గిరిజన నాయకుడు వెడమ రాము 39వ వర్ధంతి కార్యక్రమంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెడమ రాము స్మారక స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు.గ్రామానికి చేరుకున్న ప్రాజెక్టు అధికారికి గిరిజనులు తమ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో గ్రామస్తులు, గిరిజన పెద్దలు, యువత పాల్గొన్నారు.అనంతరం ప్రాజెక్టు అధికారి గ్రామంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రాధాన్యతను గుర్తుచేసుకున్నారు. గిరిజన సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే విధంగా కృషి చేయాలని సూచించారు.అనంతరం గ్రామస్తులతో ప్రాజెక్టు అధికారి మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆరా తీశారు. గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గిరిజన గ్రామాల అభివృద్ధికి ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తుందని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గిరిజన నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో పేదవాళ్లకు భూములు పంచిన ఘనత ఇందిరాగాంధీ ది

–ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో జగ్గారెడ్డి

సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ :31(విజన్ ఆంధ్ర)ఇందిరాగాంధీ హయాంలో పేదలకు పంపిణీ చేసిన భూములే నేటికీ అనేక కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తున్నాయని జగ్గారెడ్డి అన్నారు. ఆ భూములను సాగుచేసుకుంటూ పేదలు జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. శనివారం నాడు ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదలకు భూములు అందించి, వారికి ఆర్థిక భరోసా కల్పించడంలో ఇందిరాగాంధీది చారిత్రక పాత్ర అని కొనియాడారు. భూమిని పేద కుటుంబాల బతుకుదెరువుకు ఆధారంగా మార్చిన ఆమె కృషి మరువలేనిదన్నారు. బ్యాంకుల జాతీయీకరణతో సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశారని గుర్తుచేశారు.మెదక్ ఎంపీగా ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించిన ఇందిరాగాంధీకి సంగారెడ్డితో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. సంగారెడ్డిలో ఆమె పాల్గొన్న రెండు సభలను గుర్తుచేశారు. ప్రధాని హోదాలో జిల్లా పరిషత్ సమావేశంలోనూ పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఓడీఎఫ్‌తోపాటు బీడీఎల్ పరిశ్రమలు ఏర్పాటుకు ఆమె చేసిన కృషిని ప్రస్తావించారు. దేశ భద్రత కోసం క్లిష్టమైన నిర్ణయాలు తీసుకున్న ఇందిరాగాంధీ 1984లో తూటాలకు బలయ్యారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ పాలన దేశ పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి పునాదులు వేసిందని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ, తన నానమ్మ ఇందిరాగాంధీ ఆశయాల బాటలో ప్రజల కోసం పనిచేస్తున్నారని జగ్గారెడ్డి అన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

–రెమిడియేషన్, ఖాన్ అకాడమీ, ఎఫ్‌ఎల్‌ఎన్‌పై నిరంతర పర్యవేక్షణ

–కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్–31(విజన్ ఆంధ్ర)విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రెమిడియేషన్, ఖాన్ అకాడమీ, ఎఫ్‌ఎల్‌ఎన్ తరగతుల నిర్వహణను మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.శనివారం పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల ఫలితాలను సమీక్షించాలన్నారు. గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం వంటి ప్రాథమిక ప్రక్రియల్లో ప్రతి విద్యార్థి పట్టు సాధించేలా బోధించాలని సూచించారు.ఖాన్ అకాడమీలో విద్యార్థుల నమోదు పూర్తి చేయడంతోపాటు డిజిటల్ అభ్యసనంలో వారి ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. విద్యార్థులు కేవలం వినడానికే పరిమితం కాకుండా తాము నేర్చుకున్న అంశాలను స్వయంగా వివరించేలా ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి భాషా నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిన స్ఫూర్తితో ఉన్నత పాఠశాలల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాలల అభ్యసన ప్రగతిపై ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు చర్చించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ పురోగతి, డిజిటల్ అభ్యసనంపై డీఆర్‌పీలు అవగాహన కల్పించారు. ఈ



కార్యక్రమంలో జిల్లా ఏ.ఎం.ఓ. డా. పి.ఎం. షేక్, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేంద్ర కుమార్, సుల్తానాబాద్, శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆరోలెట్ ప్రతినిధులు ప్రమోద్, అంజద్, సమీద్, స్కూల్ ఇన్‌స్పెక్షన్ టీమ్ లీడర్ సి.హెచ్. అగయ్య, డి.ఆర్.పి.లు గద్దం జగదీశ్వర్, కృష్ణమోహన్, జె. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, రమేష్, మంజుల, జ్యోతి, కిరణ్, కృష్ణారెడ్డి, దేవేందర్, రవి, పుష్పలత, సి.ఆర్.పి.లు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

-అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-31(విజన్ ఆంధ్ర)దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ వల్లభాయ్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. ేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకో వాలి:

జిల్లా ఎస్పీ జి. వినీత్

నారాయణపేట ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర) సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పి వినీత్ అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా విడివిడిగా ఉన్న సుమారు 560 సంస్థానాలను ఏకీకృతం చేసి, బలమైన ఐక్య భారతదేశ నిర్మాణానికి పునాది వేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి సేవలు, కృషి చిరస్మర ణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆయన చూపిన చొరవ, దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 31వ తేదీన జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణ కు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తన, నైతిక విలువలను అలవర్చుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో మెలుగుతూ జాతీయ సమైక్యతా భావాన్నిపెంపొంది ంచుకోవాలని, దేశ సమగ్రతను కాపాడటంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎస్పీ కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గారి ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది జాతీయ సమైక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు అంకితభా వంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్,డి సి ఆర్ బీ డీఎస్పీ ఎ. మహేష్, ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీష, శివయ్య, డీపీఓ సిబ్బంది, ఆర్మడ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారులతో చర్చలు జరిపిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట 31 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)శనివారం సమీకృత జిల్లా కార్యాలయసముదాయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన అగ్రిస్టాక డేటా సంతృప్త స్థాయి సాధన, వ్యవసాయ రంగంలో వినూత్న సాంకేతిక పరిజ్ఞాన వినియోగాల గుర్తింపుపై అధికారులతో ప్రత్యేకసమావేశంనిర్వహించారు. ఈసమావేశంలో రైతుల వివరాలు, భూముల రికార్డులు, డిజిటల్ క్రాప్ సర్వే) వివరాలను సమగ్రంగా అనుసంధానం చేసి, వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంపొందించడం, రైతులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించడం, గ్రామ స్థాయిలో వ్యవసాయ ప్రణాళికలను రూపొందించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. అగ్రిస్టాక్ ద్వారా రైతుల నమోదు, భూముల వివరాలు, పంటల సాగు వివరాలను సమగ్రంగా అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో సమర్థవంతమైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా ఐదు అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. భూముల రికార్డులు, రైతుల వివరాల సమగ్రత:. రైతులకు ప్రభుత్వ పథకాలు, సేవల అందజేత:పంటల సాగు ప్రణాళిక, వ్యవసాయ విస్తరణ సేవలు:. పంటల పర్యవేక్షణ, నష్టాల అంచనా, బీమా:. మార్కెటింగ్, కొనుగోళ్లు, రవాణా, పంట అనంతర నిర్వహణఅగ్రిస్టాక్ డేటాను సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మరావు, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా కోపరేటివ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం సిద్దిపేట జిల్లా వారిచే జారీచేయనైనది.

రాముని పట్లలో భూభారతి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 31 అక్టోబర్ (విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా కేంద్రంలో గలచిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో భూ భారతి - రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరాముని పట్ల గ్రామం 1120 ఎకరాలు విస్తీర్ణం కాబట్టి జిపిఓ, సర్వేయర్, రెవెన్యూ అధికారులు అధునాతన యంత్రం రోవర్ సహాయంతో రోజువారీగా 35 నుండి 40 ఎకరాలు సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. 100 ఏళ్ల క్రితం భూముల సర్వే జరిగిందని మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భూములకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం భూ భారతి- రీ సర్వేను చేపట్టిందని, ముందుగా ప్రభుత్వ స్థలాలు, నక్ష బాటలు, చెరువులు, కుంటలు, అన్ని కొలిచాక పట్టా భూములను కొలవడం జరుగుతుందని తెలిపారు. పట్ట భూములు కొలిచేరోజు గురించి రైతులకు భూ యజమానులకు రెండు రోజుల ముందుగానే సమాచారం అందించాలని, భూములు రి సర్వే జరిగినప్పుడు భూ యజమానులు గమనించి ఏమైనా సందేహాలుఅభ్యంతరాలు తెలిపితేమళ్లీసర్వేచేయించుకోవాలని, పరిష్కారం కాకుంటే స్థానిక తాసిల్దార్ కు అర్జీ పెట్టుకుంటే 60 రోజుల్లోపు పరిష్కారం చూపుతామని సూచించారు. రైతులు,భూ-యజమానులుసర్వేజరుగుతున్నప్పుడు తప్పనిసరిగా ఎలాంటి పనులు ఉన్న

పక్కనపెట్టి సర్వే చేయించుకోవాలని, హద్దుల సమస్యలు, సర్వే నంబర్ల గందరగోళం లాంటి సమస్యలు ఉన్నాయని అధికారులపై ఆగ్రహానికి లోనూ కాకుండా సర్వే అధికారులకు సహకరించి మీ యొక్క భూమి కొలతలు సర్వే చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొదటి విడతలో 73 గ్రామాలు రెండో విడతలో ఇప్పటివరకు 30 గ్రామాలను సర్వే చేశామని జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలు సర్వే చేయడం జరుగుతుందని భూ యజమానులు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సలీం, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ బైటి శంకర్, సర్వే అధికారులు గ్రామ ప్రజాప్రతినిధులు రైతులు తదితరులు ఉన్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా 2కే రన్

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : జాతీయ ఐక్యతా దినోత్సవం దేశ సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుచేస్తుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లో ఘనంగా 2ఖ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, సమగ్రత, సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారుఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకం చేసి భారతదేశ ఐక్యతకు బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దేశ సమగ్రత, ఐక్యత, సమైక్యతను కాపాడేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా జాతీయ భావనతో ముందుకు సాగాలని, యువత దేశాభివృద్ధిలో భాగస్వాములై ఐక్యతతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ఈ 2ఖ రన్ ద్వారా దేశ ఐక్యత, సోదరభావం, జాతీయ సమైక్యత ప్రాముఖ్యతను ప్రజలకు చాటిచెప్పారు. దేశ ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. యెన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ రన్‌లో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఏఆర్ డీఎస్పీ వీరేష్ ,వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువకులు, యువతులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు

గద్వాల అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర బ్యూరో)దేశ ఐక్యతకు మార్గదర్శకుడు అయినా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను నేటియువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూదేశ ఐక్యత, సమగ్రత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆయన దూరదృష్టి, నాయకత్వ లక్షణాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ సేవలను స్మరిస్తూ వారి జయంతిని పురస్కరించుకుని నిర్వహించే 'జాతీయ ఐక్యతా దినోత్సవం' సందర్భంగా దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోలీస్ అమరవీరుల దినోత్సవం అక్టోబర్ 21 ను పురష్కరించుకొని నిర్వహించిన వ్యాస రచన, షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ కాంపిటిషన్ లో జిల్లా స్థాయి లో విజేతలుగా నిలిచినా వారికీ జిల్లా ఎస్పీ ప్రసంశా పత్రాలను అందజేశారు. పోలీస్ విభాగం లో ప్రసంశ పత్రాలు అందుకున్న వారుఎస్ఐ పై స్థాయి విభాగంలో మొదటి ప్రశంసా పత్రం ఆర్ఎస్ఐ చంద్ర కాంత్ కు, రెండవ ప్రశంసా పత్రం ఆర్ఎస్ఐ. బాలచంద్రుడు కు, మూడవ ప్రశంసా పత్రం అలంపూర్

ఎస్సై రామకృష్ణ కు అందజేశారు. పోలీసు నుండి ఏ ఎస్ ఐ స్థాయి విభాగంలోమొదటి ప్రశంసా పత్రం ఏఆర్ పోలీస్ మల్లికార్జున్ కు, రెండవ ప్రశంసా పత్రం మహిళా పోలీస్.సరస్వతి కి, మూడవ ప్రశంసా పత్ర మహిళా పోలీస్ శ్రీలతకు అందుకున్నారు. ఇంగ్లిష్ విభాగంలో.. 1వ ప్రశంసా పత్రం పోలీస్‌చంద్రమోహన్ కు, రెండవ ప్రశంసా పత్రం ఏఆర్ పోలీస్‌భరత్ కుమార్ అందుకున్నారు. హై స్కూల్ ఉ ఇంటర్ విద్యార్థుల విభాగంలోఇంగ్లిష్-మొదటి ప్రశంసా పత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇర్ఫాన్ కు, రెండవ ప్రశంసా పత్రం మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ మహిళా కళాశాల విద్యార్థి హిబా రైనాద్ కు, మూడవ పత్రం శ్రీవిద్య జూనియర్ కళాశాల విద్యార్థిని లలిత కు, 1వ తెలుగు లో జెడ్ పి హెచ్ ఎస్ అమరవాయి విద్యార్థిని ఇందు కు, 2వ జెడ్పిహెచ్ఎస్ అనంతపురం విద్యార్థిని ఐరావతి కు, 3వ జెడ్ పి హెచ్ ఎస్.ఇర్కిచెడు విద్యార్థిని శైలజ అందుకున్నారు. డిగ్రీ పై స్థాయి విభాగంలో(తెలుగు)నవనీత .బీఎస్సీ (ఎన్) కాలేజీ -1వ,శ్రావణి బీఎస్సీ (ఎన్) కాలేజీ-2వ,శిరీష బీఎస్సీ (ఎన్) కాలేజీ 3వ,ఇంగ్లిష్ లో 1.జాకీయ బీఎస్సీ (ఎన్) కాలేజీ-1వ, రహమాత్ బేగం బీఎస్సీ (ఎన్) కాలేజీ,-2వ,అఫ్రీన్ బీఎస్సీ (ఎన్) కాలేజీ, 3వ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఫోటోగ్రఫీ షార్ట్ ఫిల్మ్ విభాగంలోసోమశేఖర్ -నిర్మల ఫోటో స్టూడియో -1వ,నవీన్ కుమార్, స్వామి ఫోటో స్టూడియో -2వ,మహేష్ కవిత ఫోటో స్టూడియో -3వ, షార్ట్ ఫిల్మ్ లో .పల్లెటూరి కుర్రాళ్లు బృందం -1వ,2.సురేష్, ఐ జ -2వ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె శంకర్, డి. ఎస్పీ మొగిలయ్య, సాయుధ దళ డి. ఎస్పీ నరేందర్ రావు, ఏ ఓ చైతన్య కృష్ణ, గద్వాల్ సిఐ. శ్రీను,డిసిఆర్ బి. ఇన్స్పెక్టర్ టాటా బాబు, ఆర్ ఐ లు నరేష్, హరీఫ్ లు ఎస్సై, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల భోజనం, బోధనా పద్ధతులపై ప్రాజెక్టు అధికారి పరిశీలన

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర)తిర్యాణి మండలంలోని ఆశ్రమ పాఠశాల(బాలురు)ను శనివారం మధ్యాహ్నం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనం, పారిశు ధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ముందుగా పాఠశాలలో అమలు చేస్తున్న భోజన మెనూను పరిశీలించిన ప్రాజెక్టు అధికారి, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వంటశాల, భోజన ప్రదేశాలను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత, వంట విధానం, పరిశుభ్రత, విద్యార్థులకు భోజనం అందించే విధానాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ప్రాజెక్టు అధికారి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు

చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన ప్రాజెక్టు అధికారి, ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న ఆధునిక బోధనా పద్ధతులను విద్యార్థులకు ఎలా అమలు చేస్తున్నారో పరిశీలించారు. బోధనా విధానాలపై విద్యార్థులతో మాట్లాడి, పాఠాలు అర్థమయ్యే విధానం, కొత్త బోధనా పద్ధతుల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలపై వారి అభిప్రాయాలను సేకరించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనా విధానం మెరుగుపడేలా విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల కంప్యూటర్ మరియు పరిసరాలను పరిశీలించిన ప్రాజెక్టు అధికారి, పరిశుభ్రత, పారిశు ధ్య ప్రమాణాలను నిరంతరం పాటించాలని సిబ్బందికి సూచించారు. తరగతి గదులు, వంటశాల, భోజన ప్రదేశాలు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మంద మకరందు మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యమని, విద్యతో పాటు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన బోధనా ప్రమాణాలు అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతికి ఎలాంటి లోటు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి వేడుకలు

నారాయణపేట అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) నారాయణపేట మండలం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లో శనివారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతిలి సందర్భంగా లిజాతీయ సమైక్యతా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యా యురాలు విజయ అధ్య క్షత వహించారు. ముందు గా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ "సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఉక్కు మనిషి. దేశంలోని సంస్థానాలను విలీనం చేసి భారతదేశ సమగ్రతకు పాటుపడిన మహనీయుడు అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం విద్యార్థులం దరూ జాతీయ సమైక్యత ను కాపాడుతూ, ఐక్యతతో ముందుకు సాగాలనీ సూచించారు. నేడు దేశ మంతా రాష్ట్రీయ ఏకతా దివస్ గా జరుపుకుంటు న్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ ప్రతాప్ నిర్మల శశిరేఖ శ్రీదేవి విద్యార్థులు, పాల్గొన్నారు.

జలసిరిలో పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి

అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్లు

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ధరూర్ మండలంలోని గ్రామాలలో పర్యటించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

ధరూర్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర బ్యూరో)జలసిరి కార్యక్రమంలో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు, తదితర నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని ఓబులోనిపల్లి, ర్యాలంపాడు గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటించారు. అర్హులైన లబ్ధిదారులకు అందుతున్న పెన్షన్లపై జిల్లా స్థాయి పెన్షన్ వెరిఫికేషన్ నిర్వహించారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో విబిజి రామ్ జి పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించి పనుల పురోగతిని, నాణ్యతను సమీక్షించారు. అలాగే గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉ న్నత పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశు ధ్య నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పథకాల అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

గర్భిణీ స్త్రీ మరియు శిశు మరణానికి కారణమైన డాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

కేసును తప్పుదారి పట్టిస్తే హైకోర్టుకు ఈడుస్తాం!

షాద్‌నగర్ గర్భిణీ శిశువు ఘటనపై భగ్గుమన్న బహుజన్ సమాజ్ పార్టీ

పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలి..

బాధితుడి అరెస్టు దుర్మార్గం

నిందితులను కాపాడేందుకు వ్యవస్థల కుమ్మక్కుపై న్యాయపోరాటం చేస్తాం

బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తీవ్ర హెచ్చరిక

షాద్‌నగర్, అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర): కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో వైద్యుల ఘోర నిర్లక్ష్యం కారణంగా నిండు గర్భిణి రాధా, ఆమె కడుపులోని శిశువు ప్రాణాలు కోల్పోయిన ఉదంతంపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దారుణ ఘటనకు పూర్తి బాధ్యులైన ఆసుపత్రి వైద్య సిబ్బందిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు



దొడ్డి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. డెలివరీ కోసం వచ్చిన నిరుపేద మహిళ ప్రాణాలను నిర్లక్ష్యంతో పొట్టనబెట్టుకోవడమే కాకుండా, ఈ కేసును పక్కదోవ పట్టించేలా అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు సుమోటోగా చర్యలు తీసుకోవాలి:ఈ సందర్భంగా దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవం జరుగుతుందనే ఆశతో వచ్చిన ఒక దళిత, నిరుపేద కుటుంబానికి వైద్యులు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలకు ఆసుపత్రికి వస్తే సాయంత్రం దాకా సాధారణ కాన్పు అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రాణాలు పోయాక నాటకాలాడటం దారుణమని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో పోలీసులు తక్షణమే సుమోటోగా (రాబశీ వీశేబ) స్పందించి, బాధ్యులైన డ్యూటీ డాక్టర్లపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసును తప్పుదారి పట్టిస్తే హైకోర్టులో తేల్చుకుంటాం!వైద్యుల నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అధికారులు అబద్ధపు ప్రెస్ నోట్లు విడుదల చేయడం, మరోవైపు భార్యను, పుట్టబోయే బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న భర్త రమేష్ ను అదుపులోకి తీసుకుని పాత గొడవలను తెరపైకి తేవడం అత్యంత హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. ఆసుపత్రి యాజమాన్యాన్ని కాపాడేందుకు పోలీసులు, సంబంధిత అధికారులు కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. న్యాయం కోసం నిలబడే బాధితుల పక్షాన బీఎస్పీ పోరాడుతుందని, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై అవసరమైతే తెలంగాణ హైకోర్టు గడప తొక్కుతామని, బాధ్యులైన ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెడతామని హెచ్చరించారుబాధితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం:తల్లి లేని ఆ ఇద్దరు పసిపాపల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం తక్షణమే బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని దొడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన సూపరింటెండెంట్ సహా డ్యూటీలో ఉన్న ఐదుగురు వైద్యులను వెంటనే విధుల్లోంచి తొలగించి జైలుకు పంపాలని, లేనిపక్షంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఎల్‌నినో కరువుపై పాట సీడీని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సత్యశారద,

వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర) వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని, చౌటపల్లి గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు గౌరారపు డప్పు యుగంధర్ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులపై రచించిన ప్రత్యేక పాట సీడీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఐఏఎస్ ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) ప్రేమలత, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారుడు యుగంధర్ రచించిన పాట సీడీని అధికారులు ఆవిష్కరించారు. ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పాటను రూపొందించినట్లు తెలిపారు. ఈ పాటకు గౌరారపు డప్పు యుగంధర్ సాహిత్యం అందించగా, జూపాక శివ గానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి వరంగల్ జిల్లా కళాకారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పట్టణ రజక సంఘం అధ్యక్షుడిగా దొనకొండ నాగన్న ఘన విజయం

ప్రత్యర్థి జానకొండు రవిపై 80 ఓట్ల మెజారిటీతో గెలుపు

ఆదిలాబాద్ బ్యూరో అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర)ఆదిలాబాద్ పట్టణ రజక సంఘం అధ్యక్ష ఎన్నికలో దొనకొండ నాగన్న ఘన విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికలో తన సమీప ప్రత్యర్థి జానకొండు రవిపై 35 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రజక సంఘం కార్యాలయంలో ఈ ఎన్నిక ప్రక్రియ ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రశాంతంగా జరిగింది. సంఘం సభ్యులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టగా, దొనకొండ నాగన్నకు అత్యధిక ఓట్లు రావడంతో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. విజయం అనంతరం రజక సంఘం సభ్యులు, నాగన్న అనుచరులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. లిసంఘ అభివృద్ధే లక్ష్యం: నాగన్నఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు దొనకొండ నాగన్న మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతి రజక బిడ్డకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. రజక సంఘాన్ని మరింత బలోపేతం చేసి, కులస్తుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘంలోని పెద్దల, యువకుల సహకారంతో సంఘ భవన నిర్మాణం, సభ్యుల సంక్షేమానికి ప్రణాళికలు రూపొందిస్తానని అన్నారు. ఈ ఎన్నికల్లో పలువురు రజక సంఘ పెద్దలు, యువ నాయకులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నోటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: డాక్టర్ సోనియా దత్తా

హైదరాబాద్, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : దీపావళి పండుగ సమయంలో స్వీట్లు, స్నాక్స్ అధికంగా తీసుకోవడం వల్ల దంతక్షయం, చిగుళ్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని దంత నిపుణులు డాక్టర్ సోనియా దత్తా తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, పళ్ల మధ్య శుభ్రం చేసుకోవడం, తీపి పదార్థాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డాబర్ రెడ్ పేస్ట్‌లోని లవంగ నూనె, తామర బీజం(జాంతోక్సిలమ్), పుదీనా సత్వ వంటి ఆయుర్వేద పదార్థాలు నోటి పరిశుభ్రతకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఏ) ఆమోదం పొందిన డాబర్ రెడ్ పేస్ట్‌ను రోజువారీ దంత సంరక్షణలో ఉపయోగించవచ్చని సూచించారు.

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అర్చన

ధరూర్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర బ్యూరో)ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున అన్నదాతలు తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా రబీలో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అర్చన అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నీలహళ్లి గ్రామంలో ఖేత్ బచావో, డిజిటల్ వ్యవసాయ విస్తరణ సాంకేతికతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రస్తుత వాతావరణ పరిస్థితులు బట్టి పప్పు ధాన్యాలు, కూరగాయలు సాగు చేయవచ్చన్నారు. వరి పంట కోత అనంతరం భూమిలో అందుబాటులో ఉన్న తేమను సమర్థవంతంగా వినియోగించుకొని మినుము, ఉలవ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటల వైవిధ్యీకరణతో పాటు తక్కువ కాలపరిమితి కలిగిన పప్పుధాన్య పంటల సాగు ద్వారా నేలలోని మిగులు తేమను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఆత్మ ప్రతినిధి రంగారెడ్డి బయోచార్ తయారీ విధానం, దాని ప్రయోజనాలు, నేల సారవంతాన్ని పెంపొందించడంలో పచ్చిరొట్ట ఎరువుల పంటల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి వెంకట రాములు ప్రభుత్వ పథకం కింద బోరుబావుల రీఛార్జ్ బండ్లను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. డిజిటల్ వ్యవసాయ విస్తరణ సాంకేతికతలపై విశ్లేషణ నిర్వహిస్తూ రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా 40 మంది రైతుల నుంచి వాట్సాప్, యూట్యూబ్, టెలివిజన్ వ్యవసాయ కార్యక్రమాలు తదితర డిజిటల్ మాధ్యమాలను వ్యవసాయ సమాచార సేకరణకు ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశంపై వివరాలను సేకరించారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనల ప్రాముఖ్యతను వివరించి, వాతావరణ అంచనాలు మరియు వ్యవసాయ సలహాలను అనుసరించి పంటల యాజమాన్య చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.

బాలల భద్రత అందరి బాధ్యత

-పోక్సో చట్టం,గుడ్ టచ్..బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన అవసరం
-అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్న రాణి

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-31(విజన్ ఆంధ్ర)బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టి, వారి హక్కులకు రక్షణ కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అదనపు జిల్లా న్యాయమూర్తి స్వప్నరాణి అన్నారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిమ్మనపల్లిలోని పల్లవి పాఠశాలలో శనివారం పోక్సో చట్టం--2012, బాలల హక్కుల పరిరక్షణపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంలోని అంశాలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. బాలలపై లైంగిక వేధింపుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థల గురించి అవగాహన కల్పించారు. బాలల భద్రతలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థను నేరుగా సంప్రదించినా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. బాలల సహాయం కోసం 1098, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనిజ కోహిర్కర్, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పెద్దపెల్లి, శ్రీనివాస్, సంకీర్తన లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, నరేష్ కల్చరల్ సెక్రెటరీ, శరత్,ఝాన్సీ ,రమ ,కల్పన, శ్యామల డిసిపిఓ సిబ్బంది, శోభారాణి స్కూల్ కరస్పాండెంట్ వాణి ప్రిన్సిపల్ మరియు టీచర్లు పాల్గొన్నారు.

'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్' ను ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర)మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సంసిద్ధులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ రెడీనెస్ ప్రోగ్రామ్'ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కేవలం విద్యాపరమైన మార్కులకే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. జిల్లాలోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఇందులో తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో యంగ్ ఒరేటర్స్ క్లబ్ , థింక్ అండ్ మేక్ , స్వతః, ఫ్యూచర్ డాట్స్ వంటి నాలుగు ప్రధాన రంగాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. యంగ్ ఒరేటర్స్ క్లబ్(శీబఅస్త్ర ాతీఖశీతీం జశ్రీబఎ) కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల, మౌఖిక సంభాషణా నైపుణ్యాలు, వేదికపై ధైర్యంగా ప్రసంగించడం, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ కార్యక్రమానికి కీర్తన వేపా ప్రతినిధిగా వ్యవహరిస్తారు. థింక్ అండ్ మేక్ (ఌష్ఱఅఎ ఖఅ మీఞఎవ) కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానం, విమర్శనాత్మక ఆలోచన మరియు సమస్యలను స్వయంగా పరిష్కరించుకునే సామర్థ్యాలను అభివృద్ధి చేస్తారు. ఈ కార్యక్రమానికి నాగేష్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. స్వతః (ాజఖ్ఖుష్ట) కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, డబ్బు నిర్వహణ మరియు ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమానికి సంతోష్ దిన్నె మరియు యువరాజ్ సక్కూర్ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ఫ్యూచర్ డాట్స్ (ఖీబతీవ ఐశీం) కార్యక్రమం ద్వారా 9, 10వ తరగతుల విద్యార్థులకు వివిధ వృత్తులు, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య మరియు భవిష్యత్ కెరీర్ ప్రణాళికపై మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ కార్యక్రమానికి పవన్ కుమార్ కొల్లి, నిఖిల్ దాసరి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలూ ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక, సామాజిక మరియు ఉద్యోగ రంగాల్లో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కేవలం విద్యాపరమైన మార్కులు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తుకు సరిపోవని, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆర్థిక అక్షరాస్యత, సమస్యల పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, కెరీర్ ప్రణాళిక వంటి జీవిత నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో స్థిరమైన ఉపాధి అవకాశాలను పొందాలంటే ఆధునిక ఉద్యోగ రంగ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందించడం ప్రస్తుత కాలపు అత్యవసర అవసరమని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కని వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.ఎం.ఓ దుంకుడు శ్రీనివాస్, డి.ఎస్.ఓ షంషీర్, జి.సి.డి.ఓ అస్రా ఖాద్రి, ఎం.ఈ.ఓ ఉషారాణి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కె.జి.బి.వి ల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు

సిర్పూర్ రేంజ్‌లో ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతిజ్ఞ, మార్చ్‌ఫాస్ట్

కాగజ్‌నగర్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకొని సిర్పూర్ రేంజ్‌లో శనివారం రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన సేవలను సిబ్బంది స్మరించుకున్నారు. దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో పటేల్ పోషించిన కీలక పాత్రను గుర్తు చేసుకున్నారు. జాతీయ ఐక్యత, సమగ్రత, సమైక్యతా భావాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ సూచించారు. అనంతరం అటవీశాఖ సిబ్బందితో దేశ ఐక్యతను కాపాడటంతో పాటు అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి సంపదను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అడవుల పరిరక్షణలో అటవీశాఖ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్‌తో పాటు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

జాతీయ ఐక్యత దినోత్సవంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర)దేశ సమైక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపునిచ్చారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు విశేష కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని ఆమె పేర్కొన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడేందుకు అంకితభావంతో పనిచేస్తామని, దేశ అంతర్గత భద్రతను మరింత పటిష్టం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని అధికారులు, ఉద్యోగులతో కలెక్టర్ రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌ఐఆర్. చట్టబద్ధంగా, పారదర్శకంగా జరిగే ప్రక్రియ

ఓట్ల తొలగింపు పేరుతో కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది

బిజేపి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గద్వాల అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో (డికె. బంగ్లా) నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంతోమంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని, ఓట్లు గల్లంతయ్యాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చట్టబద్ధంగా, పారదర్శకంగా జరిగే ప్రక్రియ అని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవడానికి, అర్హులైన కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేసుకోవడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుందని వివరించారు. ముఖ్యంగా తుది ఓటర్ల జాబితా విడుదల కాకముందే ఓట్లు తొలగించారని, ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఎలా ఆరోపణలు చేస్తారని ప్రశ్నించారు. తుది జాబితా వెలువడకముందే తొందరపడి ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశం తప్ప మరొకటి లేదన్నారు. ఓటర్ల జాబితాపై నిజంగా అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ఎన్నికల అధికారులను సంప్రదించి, చట్టబద్ధమైన విధానంలో సమస్యలను పరిష్కరించుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై బురదజల్లడం మానుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారని స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా సహకరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు, రాష్ట్ర మహిళ మోర్చా అధికార ప్రతినిధి అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావ్,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ,మైనారిటీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్,మండల అధ్యక్షుడు శ్రీనివాసులు,కౌన్సిలర్ చంద్రశేఖర్, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు బియ్యం, కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై 10 కేసులు నమోదు

వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర) ;- వినియోగదారులకు సరుకులను నిర్ణీత తూకం కంటే తక్కువగా విక్రయిస్తూ మోసాలకు పాల్పడితే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి కూచన మనోహర్ హెచ్చరించారు. శనివారం వరంగల్ పట్టణంలోని పలు బియ్యం దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాలను తూకం వేయగా, 26 కిలోలుగా పేర్కొన్న బస్తాల్లో కేవలం 25 కిలోల బియ్యం మాత్రమే ఉన్నట్లు గుర్తించి మరియు ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను ఉల్లంగించిన వారిపై 10 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూచన మనోహర్ మాట్లాడుతూ, ప్రతి వ్యాపారి ప్యాకింగ్ చేసిన సరుకులపై నికర బరువును స్పష్టంగా ముద్రించాలని, ప్రకటించిన బరువుకు అనుగుణంగానే వినియోగదారులకు సరుకులు విక్రయించాలని సూచించారు. బస్తాలపై పేర్కొన్న బరువు కంటే తక్కువగా సరుకులు విక్రయిస్తే తూనికలు, కొలతల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు సైతం సరుకులు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన నికర బరువును, తూకాన్ని పరిశీలించాలని సూచించారు. వ్యాపారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, వినియోగదారుల హక్కులను కాపాడేందుకు తనిఖీలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

నీరు విద్యుత్ వృధాను నివారించండి

నారాయణపేట , అక్టోబర్31 (విజన్ ఆంధ్ర) ప్రస్తుతం ఎల్ ని నో ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొంటున్నాయని దీనితో నీటిని విద్యుత్తును వృధా చేయకుండా అధికారులు నివారించాలని తెలుగుదేశం పార్టీ పాలమూరు పార్లమెంటరీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవరావు చౌదరి ఒక ప్రకటనలో నారాయణపేట జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ నీ కోరారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించవలసిందిగా ఆయన సందర్భంగా కోరారు. ప్రజలు అర్థం చేసుకోని కారుని బట్టతో లేదా తడి బట్టతో తుడుచుకోవడం అలానే ఇంట్లో వరండాలో

ఉండే బండల్ని కట్టెతోటి తుడుచుకుంటే కొంత వరకు పొదుపు చేసినవారు అవుతారని ఆయన ప్రజలను సైతం కోరారు. ఎవరైనా నీటిని వృధా చేస్తున్నా లేదా ఇష్టం వచ్చినట్టు వాడుతున్నట్లు తెలిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్,మునిసిపల్ కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలం

- సర్పంచ్ నిర్మల వెంకన్న.

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : గాంధీనగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని గాంధీనగర్ గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న అన్నారు. శనివారం గాంధీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, మురికి కాలువల్లో పారిశుధ్య పనులను సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త బండికి అందించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, తేజావత్ హుని, రామావత్ సంధ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్యా శ్రీను, బోల్ల రాజాలు, పెద్దబోయిన వెంకన్న, లిక్కి నరేష్, చొప్పరి రాజేందర్, నవీన్, మహిళలు, యువకులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత కోనసీమకు ములుగు విద్యుత్ శాఖ అండ

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : అర్నబ్ తుఫాన్ తో అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్ కోనసీమ జిల్లాకు తెలంగాణ విద్యుత్ శాఖ అండగా నిలిచింది. టీ జీ ఎన్ డీ సీ ఎల్ చైర్మన్ వరుణ్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పునరుద్ధరణ బృందాలు కోనసీమకు తరలివెళ్లాయి. ఇందులో భాగంగా ములుగు సర్కిల్ నుండి 60 మంది కార్మికులతో 9 ప్రత్యేక బృందాలను పంపించారు. ప్రస్తుతం ఈ బృందాలు కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం వాడపాలెం గ్రామంలో ఏడిఈ సందీప్ పాటిల్, ఏ ఈ కృష్ణారావు నేతృత్వంలో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాయి. తుఫాన్ ధాటికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి, తెగిపోయిన తీగలను అనుసంధానం చేసి త్వరితగతిన విద్యుత్ వెలుగులు నింపేందుకు శ్రమిస్తున్నాయి. ఈ విషయాన్ని ములుగు ఎస్ ఈ బి.బిక్షపతి, డి ఈ కన్న రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇందిర సేవలు మరువలేనివి

- అల్వాల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు శేఖర్

అల్వాల్, విజన్ ఆంధ్ర అక్టోబర్ 31: మాజీ దేశ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని అల్వాల్ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శనివారం ఇందిరాగాంధీ 42వ వర్ధంతి సందర్భంగా..ఓల్డ్ అల్వాల్ లోని ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశ తొలి మహిళ ప్రధాన మంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో చట్టాలు తెచ్చి వారి అభ్యున్నతికి పాటుపడిందన్నారు. మహిళా శక్తికి మార్గదర్శిగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఇందిరాగాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సివిల్ యాదగిరి, బొల్లిని సురేందర్ రెడ్డి, నిమ్మ అశోక్ రెడ్డి, సూర్యకిరణ్, మల్లెల శివ, సంజయ్ గౌడ్, దిద్ద స్వామి, వెంకటేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, కొండల్ రెడ్డి, ఉదయ్, అల్వాల్ సర్కిల్ మహిళా అధ్యక్షురాలు వీనస్ మేరీ, నిర్మల, లక్ష్మీ, జ్యోతి కార్యకర్తలు పాల్గొన్నారు

బియ్యం విక్రయ ధరలను తప్పనిసరిగా ప్రదర్శించాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 31 విజన్ ఆంధ్ర : బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధర వివరాలను ప్రజలకు కనిపించే విధంగా తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్ అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో గల శ్రీనాథ్ ట్రేడర్స్, హరి ఓం ట్రేడర్స్, మహేశ్వరి ట్రేడర్స్ బియ్యం విక్రయ దుకాణాలను డి.టి., ఆర్.ఐ., ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బియ్యం విక్రయదారులు తమ విక్రయ కేంద్రాలలో వివిధ రకాల బియ్యం గరిష్ట విక్రయ ధరలను తెలిపే ఫ్లెక్సీలను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. బి పి టి బియ్యం కిలోకు 66 రూపాయలు, తెలంగాణ సోనా / హెచ్ఎంటి బియ్యం కిలోకు 74 రూపాయలు, జైశ్రీరామ్ బియ్యం కిలోకు 79 రూపాయలకు మించరాదని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు, కిరాణా వర్తకులు, మిల్లర్లు, బియ్యం విక్రయదారులు ఈ ధరలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత ధరలకు మించి బియ్యం విక్రయించరాదని సూచించారు. వినియోగదారులకు ధరలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా విక్రయ కేంద్రాలలో ధర పట్టికలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించిన వారిపై నిత్యావసర వస్తువుల చట్టం1955 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్‌లో జైపూర్ ఫూట్ క్యాంప్ గోడప్రత్రుల ఆవిష్కరణ కలెక్టర్ కె. హరిత

ఆసిఫాబాద్ అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహాయ ఉపకరణాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కాగజ్‌నగర్‌కు చెందిన సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జైపూర్ ఫూట్ క్యాంప్ గోడప్రత్రులను సంస్థ ప్రతినిధులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులు, ఊతకర్రలు, నడక సహాయకాలు, ఆర్థోపెడిక్ బూట్లు, సహాయ బెల్టులు, వినికిడి పరికరాలను సంస్థ ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. ఈ ఉపకరణాలు దివ్యాంగుల రోజువారీ జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. వీటి ద్వారా వారు తమ పనులను మరింత సులభంగా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని గుర్తించి శిబిరంలో పాల్గొనాలని కోరారు. అవసరమైన సహాయ ఉపకరణాలను పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. దివ్యాంగుల జీవితాల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఉచితంగా అందించే పరికరాలను అవసరమైన వారు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి స్వస్థ వెల్నెస్ సెంటర్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంచిరేవుల 142 ఎకరాలు, మియాపూర్ భూముల వెనుక అసలు నిజం ఇదే

మంచిరేవుల 142 ఎకరాలు: 50 ఏళ్ల కోర్టు పోరాటం

మంచిరేవులలో 142 ఎకరాల, రూ.10 వేల కోట్ల విలువైన భూమిని తాము కాపాడామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అది పూర్తిగా అవాస్తవమని హరీష్ రావు అన్నారు. ఈ భూమిపై 40 నుంచి 50 ఏళ్లుగా కోర్టులో కేసు నడుస్తోందని ఆయన గుర్తు చేశారు. ఈ భూమి ఎవరిది అనే విషయంపై దశాబ్దాలుగా న్యాయపోరాటం జరుగుతూనే ఉంది. ఈ భూమిపై 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టులో ఓడిపోయిందని హరీష్ రావు అన్నారు. అప్పుడు అడ్వకేట్ జనరల్ కోర్టుకు హాజరు కాకపోవడం వల్లే ఆ కేసులో ప్రభుత్వం ఓటమి పాలైందని, దాదాపు ఆ భూమి ప్రభుత్వ చేతి నుంచి జారిపోయే పరిస్థితి వచ్చిందని ఆయన చెప్పారు. ఆ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక పరిస్థితి మారిందని హరీష్ రావు అన్నారు. ఈ భూమి కేసు కోసం వైద్యనాథ్ అనే సీనియర్ న్యాయవాదిని ప్రభుత్వం నియమించిందని, ఆయన బలమైన వాదనలు వినిపించడం వల్లే 31-12-2021న హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవని చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఆయన తెలిపారు. ఆనాడు భూమిని పోగొట్టింది కాంగ్రెస్ అని, తిరిగి సాధించింది బీఆర్ఎస్ అని హరీష్ రావు స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు తర్వాత ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారని, అక్కడ కూడా ప్రభుత్వం తరపున బలమైన న్యాయవాదులను పెట్టి పోరాడామని, ఫలితంగా 2023లో ఆ భూములు ప్రభుత్వ భూములే అని సుప్రీంకోర్టు తీర్పు వచ్చేలా చేసామని ఆయన చెప్పారు.

గ్రేహౌండ్స్ భూమిలో 10 ఎకరాల కుంభకోణం

మేము అంత కష్టపడి కాపాడిన మంచిరేవుల గ్రేహౌండ్స్ భూమిలో 10 ఎకరాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అక్రమంగా కట్టబెట్టిందని హరీష్ రావు ఆరోపించారు. ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాకు చెల్లించకుండా 10 ఎకరాల 10 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేశారని ఆయన అన్నారు. మహమ్మద్ అమీర్ సలావుద్దీన్ అనే వ్యక్తి ద్వారా డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ అధినేత సంతోష్ రెడ్డి పేరిట ఈ రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపణలు చేశారు. పోలీస్ శాఖకు చెందిన గ్రేహౌండ్స్ భూమి ఇది. అలాంటి భూమి ఒక ముఖ్యమంత్రికి, హోంమంత్రికి తెలియకుండా ఎలా రిజిస్ట్రేషన్ అవుతుంది అని హరీష్ రావు ప్రశ్నించారు. ఈ స్కామ్ వెనుక ఎవరున్నారో, ఎంత లావాదేవీ జరిగిందో బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

మియాపూర్ భూములపై రేవంత్ చెప్పిందంతా అబద్ధం

మియాపూర్ భూముల గురించి రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలేనని హరీష్ రావు ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 95 సార్లు ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిందని, ప్రతిసారీ వైద్యనాథ్ గారు ప్రభుత్వం తరపున బలంగా వాదించారని తెలిపారు. జాగీర్ అబాలిషన్ యాక్ట్ కు చట్టబద్ధత కల్పించడం వల్లే ఈరోజు మియాపూర్ భూములు ప్రభుత్వానికి దక్కాయని ఆయన అన్నారు. ఆ చట్ట సవరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని గుర్తు చేశారు. అసలు మియాపూర్ భూముల విషయంలో జరిగిన అక్రమాలను మొదట గుర్తించి సీఐడీ విచారణకు ఆదేశించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని హరీష్ రావు చెప్పారు. అందులో పాల్గొన్న అధికారులను సస్పెండ్ చేసిందీ తామేనని అన్నారు. ఆ భూముల విషయంలో డా. ప్రసాద్, పార్థసారథి, పీవీఎస్ శర్మ, శ్రీనివాస్ రావు అనే వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపింది కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. డా. ప్రసాద్ తో బీఆర్ఎస్ పార్టీకి సంబంధాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారని, అసలు డా. ప్రసాద్ కు చెందిన ట్రినిటీ సంస్థ భూములను సుప్రీంకోర్టులో కూడా పోరాడి, అవి ప్రభుత్వానికి చెందిన భూములని తీర్పు వచ్చేలా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని హరీష్ రావు అన్నారు. మొన్న మియాపూర్ భూముల గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కూడా మేము తెచ్చిన డా. ప్రసాద్ భూముల ఆధారంగానే ఇస్తున్నామని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందని ఆయన వెల్లడించారు. అంటే బీఆర్ఎస్ వేసిన పునాదిపైనే ఈరోజు తీర్పులు వస్తున్నాయని ఆయన అన్నారు. చివరగా మంచిరేవుల, మియాపూర్ భూముల విషయంలో వాస్తవాలు దాచకుండా ప్రజల ముందు పెట్టాలని, తాము కాపాడిన వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై క్రెడిట్ కొట్టేయాలని చూడవద్దని హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు. వారితోపాటు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు..

చిన్నరాయునీ, బండ చెరువుల పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- హైడ్రా కమిషనర్‌కు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి

అల్వాల్, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31 : మల్కాజిగిరి నియోజక వర్గంలోని చిన్నరాయునీ, బండ చెరువుల అభివృద్ధి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం ఆయన హైడ్రా ప్రధాన కార్యాలయంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఐపీఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిధిలోని చెరువుల అభివృద్ధి, పరిరక్షణతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పలు కీలక అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అల్వాల్ పరిధిలోని చిన్నరాయుని చెరువు అభివృద్ధి, పరిరక్షణపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా చర్చించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలకు టీడీఆర్ కల్పించి నట్లయితే, చెరువు అభివృద్ధికి వారు సహకరించేందుకు ముందుకు వస్తారని వివరించారు. ఈ నేపథ్యం లో చిన్నరాయుని చెరువు సమగ్ర అభివృద్ధికి సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మల్కాజిగిరిలోని బండ చెరువు అభివృద్ధి, పరిరక్షణ పనుల కోసం ఇప్పటికే రూ.20 కోట్ల నిధులు మంజూరైనాయని, ఆ నిధులతో అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. చెరువు పరి రక్షణతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా సమగ్ర అభివృద్ధి చేపట్టాలన్నారు. మౌలాలి సర్కిల్ పరిధిలోని రామకృష్ణాపురం చెరువు, ఫుట్ బాల్ గ్రౌండ్ పరిరక్షణ కు హైడ్రా చేస్తున్న కృషికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై కూడా ఎమ్మెల్యే సంబంధిత అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అంశాలను పరిశీలించి, సాధ్యమైన మేరకు అభివృద్ధి పనుల పురోగతికి అవసరమైన చర్యలు తీసు కుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, మధుసూదన్ రెడ్డి, గౌరీశంకర్, సంబంధిత కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

- ఎస్పీలు పద్మజా, సునితారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): వనపర్తి జిల్లాలో మాదకద్రవ్యాల కట్టడికి పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఈగల్ ఫోర్స్) ఎస్పీ పీవీ పద్మజా, జిల్లా ఎస్పీ డి. సునితారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌డిపిఎస్ కేసులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ కేసుల దర్యాప్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.

డ్రగ్ పెడ్లర్ల నెట్‌వర్క్ ఛేదించాలి

ఈ సందర్భంగా ఈగల్ ఫోర్స్ ఎస్పీ పీవీ పద్మజా మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను సరఫరా చేసే ప్రధాన డ్రగ్ పెడ్లర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి సరఫరా నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో ఛేదించాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌డిపిఎస్ చట్టంపై దర్యాప్తు అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని, పక్కా ఆధారాలతో కేసుల దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్షలు పడేలా పకడ్బందీగా ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. 'నషా ముక్త్ భారత్ 2029' లక్ష్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా వనపర్తి

జిల్లా ఎస్పీ డి. సునిత రెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ తరపున సమగ్ర కార్యాచరణ అమలు చేస్తామని స్పష్టం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, యువతను భాగస్వాములను చేస్తూ డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ప్రజలను కోరారు.ఈ సమావేశంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, వనపర్తి డీఎస్పీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఆత్మకూరు సీఐ శివకుమార్, జిల్లా ఎస్సైలు, ఈగల్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

'పాజ్ థింక్ వెరిఫై' పాటిస్తే సైబర్ మోసాలకు చెక్ - ఎస్పీ సునీత రెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30 (విజన్ ఆంధ్ర) జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసం (అక్టోబర్ 2026)లో భాగంగా వనపర్తి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పాజ్ థింక్ వెరిఫై అనే ప్రధాన నినాదంతో వనపర్తి పట్టణంలో గురువారం సాయంత్రం సైబర్ ఫ్లాష్ వాక్ నిర్వహించారు. మొబైల్ ఫోన్ల టార్చ్‌లైట్ల వెలుగుల మధ్య సాగిన ఈ వినూత్న అవగాహన ర్యాలీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి ఈ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని నడిచారు.

కెడిఆర్ పాలిటెక్నిక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు...

వనపర్తిలోని కెడిఆర్ పాలిటెక్నిక్ నుంచి ప్రారంభమైన ఈ ఫ్లాష్ వాక్ అంబేద్కర్ చౌక్ వరకు చేరుకొని, అక్కడి నుంచి తిరిగి పాలిటెక్నిక్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తమ మొబైల్ ఫోన్లలోని టార్చ్ లైట్లను వెలిగిస్తూ ముందుకు సాగారు. మొబైల్ ఫోన్ లైట్ల వెలుగుల మధ్య పాజ్ థింక్ వెరిఫై' నినాదాన్ని గట్టిగా చాటిచెబుతూ సైబర్ నేరాల పట్ల ప్రజల్లో చైతన్యం నింపారు. డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనే బలమైన సందేశాన్ని ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేసేందుకు నిత్యం కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నకిలీ లింకులు, ఫేక్ వెబ్‌సైట్లు, తప్పుడు ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ "పాజ్ థింక్ వెరిఫై" అనే మూడు సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌లో ఏదైనా అనుమానాస్పద సందేశం, లింక్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా కొద్దిసేపు ఆగాలి.వచ్చిన సమాచారం నిజమా కాదా అని లోతుగా ఆలోచించి విశ్లేషించాలి.ఆ సమాచారం, లింకులు లేదా వ్యక్తుల గుర్తింపును అధికారిక మార్గాల్లో ధృవీకరించుకోవాలి.

మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయండి

ఒకవేళ సైబర్ నేరానికి గురైనట్లయితే ఎవరూ ఆందోళన చెందకుండా వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. సైబర్ భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి లా అండ్ ఆర్డర్ డీఎస్పీ గిరిబాబు, డీటీఆర్సీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సర్కిల్ సీఐ సుగంధరత్నం, సైబర్ క్రైమ్ సీఐ శివ నాయక్, సైబర్ ఎస్సై రవి ప్రకాష్, టౌన్ ఎస్సైలు, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై పర్వతాలు, సైబర్ క్రైమ్ సిబ్బంది, పోలీస్ అధికారులు, అలాగే విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు మీడియా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చుక్క చుక్క ఒడిసిపట్టి.. ఎల్‌నినోపై సమరం!

-ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు కలెక్టర్ నేతృత్వంలో సమగ్ర ప్రణాళిక

-యాసంగిలో వరికి స్వస్తి.. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

-వీబీజీ రామ్‌జీ పథకంతో గ్రామాల్లో జలకళ

-జిల్లా పౌర సంబంధాల అధికారిణి బి.తిరుమల

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్-31(విజన్ ఆంధ్ర) : రాబోవు రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశాలు దృష్ట్యా ఉండబోయే పెద్దపల్లి జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష నేతృత్వంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, తాగునీరు, విద్యుత్ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో ఈ చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లాలో సాధారణ వర్షపాతం 940.9 మి.మీ. కాగా, అక్టోబర్ 27 వరకు 863 మి.మీ. వర్షపాతం నమోదై 8 శాతం లోటు నెలకొంది. ఈ నేపథ్యంలో తెలంగాణ జలనిధి, వీబీజీ రామ్‌జీ పథకాల ద్వారా 1,144 ఫామ్ పాండ్స్, 7,890 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, 230 సామూహిక సోక్‌పిట్లు, 65 బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 263 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూనే శాశ్వత జల సంరక్షణ నిర్మాణాలు చేపట్టనున్నారు. యాసంగి సీజన్‌లో నీటి అవసరం ఎక్కువగా ఉండే వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని, వరికి బదులుగా జొన్న, సజ్జ, రాగి, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నారు. సూక్ష్మ సేద్య పద్ధతుల విస్తరణపైనా దృష్టి సారించారు. ప్రస్తుత ఖరీఫ్ పంటల పరిరక్షణకు ఎస్ఆర్ఎస్పీ నీటిని వినియోగిస్తూ చివరి ఆయకట్టు వరకు సరఫరాపై పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నవంబర్ 15 నుంచి గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చేతిపంపులు, మోటార్లు, పైపులైన్లు, నీటి ట్యాంకులకు మరమ్మతులు చేపట్టనున్నారు. వ్యవసాయానికి 12 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరాతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను వెంటనే పరిష్కరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా గ్రామాల్లో ఆటపాటల ద్వారా నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటలు, భూగర్భ జలాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడం, రైతుల పంటలను కాపాడటం, గ్రామీణులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీవో ఆర్ కృష్ణయ్య

అయిజ అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కిష్టాపురం గ్రామపంచాయతీలో ఇవాళ వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ పథకము ద్వారా కిష్టాపురం గ్రామ సర్పంచ్ కుమ్మరి జయమ్మ నరేష్ సూచనలతో గ్రామ రైతు పొలంలో ఫామ్ బండ్ ఏర్పాటు చేస్తున్న ఫామ్ బండ్ ను ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీ ఓ మనోహర్,సర్పంచ్ భర్త కుమ్మరి నరేష్ ఉపసర్పంచ్ రవికుమార్ పంచాయతి సెక్రటరి ఆంజనేయులు కలిసి పనులను పరిశీలించినారు ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని, బోర్ రీఛార్జ్ పనులు వంటి అన్ని జలసిరి పనులు చేపట్టాలని సూచించారు.

శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానం విశేషం

- శంఖచక్రాలతో కూడిన ఆంజనేయ స్వామి రూపం దర్శనం

- గర్భగుడిలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహానికి గోడలు లేకుండా తెరిచి ఉండటం విశేషం

- ఆలయ ఐజి సారా శ్రీనివాస్

వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : శంఖచక్రాలతో కూడిన ఆంజనేయ స్వామి రూపాన్ని న్యాయమూర్తులు దర్శించుకోవడం విశేషమని ఆలయ ఈఓ సారా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భగుడిలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహానికి గోడలు లేకుండా తెరిచి ఉండటం మరో విశేషమని ఆయన కొనియాడారు. మెదక్ జిల్లా, శివ్వంపేట మండలం, చిన్నగొట్టిముక్క పరిధిలోని చాకలిపెట్ట ప్రాంతంలో శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానం నెలకొని ఉంది. నర్సాపూర్ – తూప్రాన్ రోడ్డు మార్గంలో, దట్టమైన అటవీ ప్రాంతం మధ్య ఈ ఆలయం ప్రశాంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్వామివారు స్వయంభువుగా పూజలందుకుంటారని ఆయన తెలిపారు. సుమారు 60 ఏళ్ల క్రితం భాస్కర రాయుని సీతారామ శర్మకే ఈ క్షేత్రం వెలుగులోకి వచ్చిందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటారు. అప్పటి నుండి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఈ రోజు శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానం, చాకలిపెట్టను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గౌడ ప్రవీణ్ కుమార్, మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, జిల్లా న్యాయమూర్తి సుచరిత, నర్సాపూర్ బార్ అసోసియేషన్ మెంబర్లు, ఆర్డీఓ రామక్రిష్ణ, తూప్రాన్ నరేందర్ గౌడ్, నర్సాపూర్, తూప్రాన్ సిఐలు, శివంపేట ఎస్ఐ దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జిని ఈఓ సారా శ్రీనివాస్, ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, అర్చకులు శాలువా పూలదండలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దేవస్థానం యొక్క విశేషాలను తెలియపరిచి అర్చన చేయించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. దేవస్థాన అర్చకులు దేవదత్తశర్మ, దేవీ శర్మ, ప్రభురాజ శర్మ,రమేష్ పంతులు, జూ. అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతకు కృషి చేసిన మహానుభావులు వల్లభ్ భాయ్ పటేల్

- నివాళులర్పించిన ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ అక్టోబర్31: (విజన్ ఆంధ్ర) జాతీయ ఐక్యత కోసం కృషి చేసిన మహానుభావులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వర్ని చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 సంస్థానాలను విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమగ్రత ఐక్యతకోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గుజరాత్ లో ప్రపంచంలోనే ఎత్తైన " స్టాచ్యూ ఆఫ్ యూనిటీ " పటేల్ విగ్రహాన్ని నిర్మించి ఘనమైన నివాళి అందించారన్నారు. అలాగే నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి పటేల్ కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ప్రధానంగా 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలో ఆపరేషన్ పోలో ప్రారంభించి, సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు కల్పే అర్చనా చిరంజీవి, జగదీష్ కులకర్ణి, మల్కాయి మహేందర్, మఠం పవన్, న్యాలం సునీత రాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువత కార్యక్రమం 4.0

నిజామాబాద్ అక్టోబర్31:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లోనీ జీవనశైలి వ్యాధుల నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 రెండు నెలల కార్యక్రమంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు జిల్లాలోని వైద్యాధికారులకు జూమ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 28వ తారీకు నుండి రెండు నెలల పాటు టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ ని జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పాఠశాలలు కళాశాలలు డిగ్రీ కళాశాలలో మరియు యూనివర్సిటీ విద్యార్థులకు పొగాకు పొగాకు ఉత్పత్తులు వాడకం ద్వారా కలిగే అనర్థాలు ప్రధానంగా నోటి క్యాన్సర్ లంగ్ క్యాన్సరు, గుండె జబ్బులు ,దంతాల క్షీణత, మెదడుపై ప్రభావం, నరాల బలహీనత మొదలగు వ్యాధుల పై అవగాహన కలిగించాలన్నారు. యువకులు పొగాకు పొగాకు ఉత్పత్తులు పాన్పర గుట్కా సిగరెట్ బీడీ తంబాకు ట్రైనింగ్ హుక్కా ఎలక్ట్రానిక్ సిగరెట్లు మరియు డ్రగ్స్ లాంటి వాటికి అలవాటు పడి బానిసై వారి యొక్క జీవితంలో లక్ష్యాలను చేరుకోలేక ప్రాణాలను వదులుతూ ఎందులోకి పనికిరాకుండా తల్లిదండ్రులకు భారమవుతున్నారని అట్లాంటి వారిని జీవనశైలిలో మార్పులు తీసుకొస్తూ అలవాట్లలో మార్పులు తెస్తూ ప్రవర్తనలో మార్పులు తేవాలని ఈ సందర్భంగా వైద్యాధికారులకు సూచించారు. ఈ రెండు నెలల కాలంలో మొదటి రెండు వారాలు ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ ద్వారా విస్తృత ప్రచారాన్ని ప్రతి గ్రామస్థాయి నుండి చేయాలని ఎవరైనా పొగాకు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడి బానిసైతే వారిని టోల్ ఫ్రీ నంబర్ 14416 కి కాల్ చేసి మానసిక వ్యాధి నిపుణుల సలహాలు చికిత్సలు పొందాలని అవసరమైతే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని డి అడిక్షన్ సెంటర్కు రిఫర్ చేయాలని తెలియజేశారు. తర్వాత రెండు వారాలు మూడు మరియు నాలుగు వారం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పాఠశాలలు కళాశాలలో డిగ్రీ కళాశాలలో ప్రొఫెషనల్ కళాశాలలో ఉన్నటువంటి యువతను విస్తృతంగా అవగాహన కలిగించాలని అన్నారు. ప్రతి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ని టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ గా మార్చాలని ఉపాధ్యాయులను అధ్యాపకులని సంసిద్ధం చేయాలన్నారు. తర్వాత రెండు వారాలు ఐదు మరియు ఆరవ వారంశీ ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామంలో ఉన్నటువంటి యువతను మత్తు పదార్థాలకు పొగాకు ఉత్పత్తులకు చెడు వ్యసనాలకు బానిస కాకుండా అవగాహన కలిగించి వారి వ్యక్తిత్వంలో మార్పులు నడవడికలో ప్రవర్తనలో పొగాకే రహిత సమాజం వైపు నడిచేలా చూడాలని గ్రామాలఅబ పొగాకు రహిత ,టొబాకో ఫ్రీ గ్రామాలుగా మార్చాలన్నారు. 7 8 వారాల్లో పొగాకు పొగాకు ఉత్పత్తులను బహిరంగంగా కాల్చే వారిపై, పాఠశాల లేదా కళాశాల నుండి 100 మీటర్ల లోపల పొగాకు ఉత్పత్తులు అమ్మే వారిపై, ఏ ప్రాంతంలోనైనా 18 సంవత్సరాల లోపు వారికి పొగాకు ఉత్పత్తులను అమ్మడం మరియు 18 సంవత్సరాల లోపు వారి చేత పొగాకు ఉత్పత్తులను అందించడం లాంటి వి చేసేవారిపై, పొగాకు ఉత్పత్తుల అమ్మకంపై బహిరంగంగా ప్రకటనలు చేసిన వారిపై,జిల్లా స్థాయి ఎన్ఫోర్స్మెంట్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించి జరిమానాలను విధించడం లాంటివి చేయాలని సూచించారు. అదేవిధంగా మొత్తం భారత్ అభియాన్పై జీవనశైలి వ్యాధులపై మాత శిశు ఆరోగ్యం మరియు మాతా శిశు మరణాలపై సమీక్షించడం కూడా జరిగింది. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ బోధన్ డాక్టర్ విద్య,పిఓఎన్సిడి డాక్టర్ వెంకన్న, పి ఓ ఎం హెచ్ ఎన్ డాక్టర్ శిఖర, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ పి వెంకటేష్, వివిధ డివిజన్లో నుండి డిప్యూటీ డిఎంహెచ్వోలు ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, పర్యవేక్షణ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మియాపూర్ డివిజన్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి.అక్టోబర్ 31: (విజన్ ఆంధ్ర) : రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయలతో మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నూతనంగా చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ మియాపూర్ డివిజన్ పరిధిలోని దీఖ ఎన్ క్లేవ్ , మయూరి నగర్, నడిగడ్డ తండా, ాావీ= హై ల్యాండ్ అపార్ట్మెంట్, శ్రీల గార్డెన్ న్యూ కాలనీ,శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలో రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం మియాపూర్ డివిజన్ పరిధిలోని దీఖ ఎన్ క్లేవ్ , మయూరి నగర్, నడిగడ్డ తండా, SMR హై ల్యాండ్ అపార్ట్మెంట్, శ్రీల గార్డెన్ న్యూ కాలనీ,శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలలో రూ. 13 కోట్ల 82 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణం పనులకు, మరియు వరద నీటి కాల్వ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులు మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీల వాసులకు నేటితో ఉపశమనం లభించింది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని , శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అగ్రభాగాన నిలబెడుతామని పిఏసి చైర్మన్ గాంధీ తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళా సోదరీమణులు , కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఉక్కు మనిషికి ఘన నివాళి.. ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : దేశ సమైక్యత, సమగ్రతల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఐ డి ఓ సి లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే మన లక్ష్యం...

- నిజాయితీ ప్రతి ఒక్కరి బాధ్యత - అదనపు కలెక్టర్ మహేందర్ జి.

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ – 2026 లో భాగంగా సత్యనిష్ఠతో సమృద్ధి" అనే నినాదంతో శనివారం ఐ డి ఓ సి సమావేశ మందిరంలో ఏసీబీ వరంగల్ రేంజ్ డి.ఎస్.పి సాంబయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులను నిజాయితీతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అవినీతి వల్ల సమాజంపై పడే దుష్ప్రభావాన్ని వివరించారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి మాట్లాడుతూ, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని, పారదర్శక పాలన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ద్వారా అవినీతిని అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మియాపూర్100,101 సర్వే నంబర్ లో దశాబ్దాలుగా ఏర్పాటు చేసుకున్న పేదల ఇండ్లకు పట్టాలు ఇచ్చి చట్టబద్ధత చేయాలి

మిగులు భూమిని పేదవారికి ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేస్తూ ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్, యంసిపిఐ(యు) నాయకత్వం వినతి

శేరిలింగంపల్లి అక్టోబర్ 31 విజన్ ఆంధ్ర: మియాపూర్100,101 సర్వే నంబర్ లో దశాబ్దాలుగా ఏర్పాటు చేసుకున్న స్టాలిన్ నగర్, ముజాఫర్ అహ్మద్నగర్ పేదల ఇండ్లకు పట్టాలు ఇచ్చి చట్టబద్ధత చేయాలని, మిగులు భూమిని పేదవారికి ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయాలని, ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూమిని వినియోగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, అదనపు కలెక్టర్ యంసిపిఐ(యు) నాయకత్వం ఈరోజు వినతి పత్రాన్ని సమర్పించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 100,101లో గత నాలుగు దశాబ్దాలుగా ముజఫర్ అహమ్మద్ నగర్,స్టాలిన్ నగర్ లలో ప్రజలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని వీరినివాసాలకు గత ప్రభుత్వాలు జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 505 జీవో ఎంఎస్ నెంబర్ 166, జీవో ఎంఎస్ నెంబర్ 58 కింద మాకు పట్టాలి ఇచ్చి చట్టబద్ధత చేయాలని అనేకసార్లు ప్రభుత్వాలకు దరఖాస్తు పెట్టుకున్నారు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వాలు మారినప్పుడు ఈ రెండు బస్తీలలో కొన్ని ఇండ్లకు కొన్ని ఇంటి నంబర్లు అలాగే ఆర్డీవో ద్వారా పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది తప్ప ఎలాంటి పట్టాలను జారీ ఇవ్వలేదని వినతి పత్రంలో వారు పేర్కొన్నారు. ప్రస్తుతం తేది 29-10-2026 నాడు సుప్రీంకోర్టు 100,10 1 సర్వే నంబర్లలో గల భూమి మొత్తము ప్రభుత్వానికి చెందినదని తీర్పివ్వడం హర్షనీయంగా తెలియజేశారు. ఇలాంటి తరుణంలో 100,101 సర్వే నంబర్లలో స్టాలిన్ నగర్ ముజాఫర్ అహ్మద్ నగర్ లాలో నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్న వారికి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇచ్చి చట్టబద్ధత చేయాలని, అలాగే ఈ సర్వే నంబర్లలో100,101 మిగులు భూములను ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల కింద పంపిణీ చేయాలనీ,రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఇందిరమ్మ ఇండ్లు డబుల్ బెడ్ రూములు కట్టించి ఇవ్వాలని, మిగులు భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, 200 పడకల ఆసుపత్రి, ఓపెన్ క్రీడా స్టేడియం,మార్కెట్ యాడ్ అలాగే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ కోసం నిర్మాణాల ఏర్పాటు కోసం ప్రభుత్వం తక్షణం పూనుకోవాలని, ఇట్టి భూమిని అమ్మకానికి ప్రైవేటు సంస్థలకు పెట్టుబడిదారులకు అమ్మకూడదని వినతి పత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారి తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ సి చంద్రా రెడ్డి గారికి కూడా వినతిపత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో యంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్, కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్,పల్లె మురళి,తాండ్ర కళావతి కమిటీ సభ్యులు జి శివాని,డి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ములుగు మున్సిపాలిటీలో పన్నుల మోత..

- ఆందోళనలో వ్యాపారులు..

- అఖిలపక్షం ఆధ్వర్యంలో కమిషనర్ కార్యాలయం ముట్టడి

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ పరిధిలో అడ్డగోలుగా పన్నులు పెంచడంతో సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శనివారం వందలాది మంది ప్రజలు, వ్యాపారులు కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు.

భువన సర్వే పేరుతో దోపిడీ..

అధికారులు భువన సర్వే పేరుతో ఇష్టారీతిగా సర్వే చేసి పన్నులు విధిస్తున్నారని ఆరోపించారు. స్క్వేర్ ఫీట్ కు 20 పైసల నుంచి 1.75% కి పెంచామని కాగితాల్లో చూపుతూ, వాస్తవంలో వందల్లో ఉన్న పన్నులను వేలల్లోకి, వేలల్లో ఉన్నవాటిని లక్షల్లోకి పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. రూ.500 – 1000 కట్టే సాధారణ ఇళ్లకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు పన్ను వేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. అలాగే రూ.10 వేలు ఉన్న సాధన, మిరాకిల్, సన్ రైజర్స్, అరవింద స్కూళ్లకు రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు, గతంలో రూ.50 వేలు ఉన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్ కు ఏకంగా రూ.10 లక్షలకు పైగా పన్ను వేయడంతో చిన్న వ్యాపారాలు మూతపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కమిషనర్ పరార్.. ప్రజల ఆగ్రహం

ఆందోళన సమయానికి కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో టీపీఓ కిరణ్, మేనేజర్ రాజేందర్ లను నిలదీసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం కమిషనర్ తో మాట్లాడి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా వెనుదిరిగారు. రూ.100 పన్నును రూ.150 చేస్తే భరిస్తామని, కానీ రూ.100 ఉన్నదాన్ని రూ.1000 చేయడం దోపిడీయేనని, ఇలాంటి అక్రమ పన్నులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పన్నుల పెంపుతో నష్టపోతున్న నూతన గృహ నిర్మాణదారులు, చిన్నా, పెద్ద వ్యాపారస్తులు, మున్సిపల్ బాధితులందరూ సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు జరిగే సమావేశానికి తరలిరావాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.

యు.డి.ఐ.డి., సదరం పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్

మంచిర్యాల (ప్రతినిధి) అక్టోబర్ 31 విజన్ ఆంధ్ర : యు.డి.ఐ.డి., సదరం కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సెర్ప్ సిఈఓ దివ్య దేవరాజన్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, గ్రామీణ అభివృద్ధి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ సిఈఓ మాట్లాడుతూ జిల్లాలో యు.డి.ఐ.డి., సదరం శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న యు.డి.ఐ.డి. సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు, ధ్రువీకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ పనుల పురోగతిపై సమీక్షించి, సంబంధిత అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో యు.డి.ఐ.డి., సదరం కార్యక్రమాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అర్హులైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డా. శ్రీధర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, డి పి ఎం అన్నాజీ, మెప్మా పి.డి. సుభాష్, విద్యాశాఖ సిబ్బంది, సదరం డిఈఓలు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలను ప్రకటించిన ప్రభుత్వం..

- జిల్లాలోని 13 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ..

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

గద్వాల అక్టోబర్ 31(విజన్ ఆంధ్ర బ్యూరో) : ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 2026 ఖరీఫ్ సీజన్లో జోగులాంబ గద్వాల జిల్లాలోని తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అన్నారు. దాంతో ఆయా మండలాల రైతులు ప్రత్యేక రుణ సదుపాయాలను పొందేందుకు వీలు కల్పించడంతోపాటు ప్రత్యేక ప్రయోజన బదిలీ ద్వారా పంట పెట్టుబడి రాయితీని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పశు గ్రాసం ఏర్పాటు, తాగునీటి సరఫరా మెరుగుపరచడం, అవసరమైన చోట్ల పశువుల శిబిరాలను ఏర్పాటు చేయడం, విబిజి రాంజీ పథకం ద్వారా ఉపాధి అవకాశాలను పెంపొందించడం, తదితర చర్యలతో కరువు మండలాల్లోని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తగువిధంగా స్పందిస్తుందన్నారు.

నీటిని పొదుపుగా వాడాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ పిలుపు

తాగునీటికి ప్రాధాన్యం, యాసంగి సాగుకు ముందు అధికారులను సంప్రదించండి: కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.

ములుగు అక్టోబర్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో అందుబాటులో ఉన్న జలవనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ప్రజలకు సూచించారు. రానున్న వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు. జిల్లాలో వానాకాలం పంటలకు రామప్ప సరస్సు ద్వారా 5,180 ఎకరాలు, లక్నవరం సరస్సు ద్వారా 4,500 ఎకరాలు, పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా 7,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించినట్లు తెలిపారు. కన్నాయిగూడెం మండలం గంగారం గ్రామంలోని దేవాదుల పంప్ హౌస్ ద్వారా జూలై 2026 నుండి ఇప్పటివరకు సుమారు 16.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, ఎత్తైన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించినట్లు పేర్కొన్నారు. ఇకపై నీటి ఎత్తిపోతలు గోదావరిలో నీటి లభ్యతపై ఆధారపడి ఉంటాయని వివరించారు.

యాసంగి సాగుపై అప్రమత్తంగా ఉండాలి:

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున యాసంగి పంటలకు సాగునీరు విడుదల చేయడం కష్టంగా మారిందని, ప్రస్తుతం ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వినియోగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. రైతులు సాగుకు సన్నద్ధమయ్యే ముందు నీటిపారుదల శాఖ అధికారులను సంప్రదించి నీటి లభ్యత వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని, పైపులైన్ల లీకేజీలను గుర్తిస్తే అధికారులకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. సంప్రదించాల్సిన అధికారులు: బి. అప్పల నాయుడు, జిల్లా నీటిపారుదల అధికారి, ములుగు – 9704678210 సి.హెచ్. శంకరయ్య, ఈఈ, ఏటూరునాగారం – 9441653031 కె. నారాయణ, ఈఈ, ములుగు – 9492643623.

వనపర్తి కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ ఎఫ్‌ఏసీ బాధ్యతలు

- వ్యక్తిగత కారణాలతో 15 రోజుల సెలవులో వెళ్లిన కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఆదర్శ్ సురభి వ్యక్తిగత కారణాలరీత్యా సెలవుపై వెళ్లారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 13వ తేదీ వరకు మొత్తం 15 రోజుల పాటు ఆయన సెలవులో ఉండనున్నారు. ఆయన సెలవు కాలంలో వనపర్తి జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నిర్వర్తించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. 15 రోజుల సెలవు ముగిసిన అనంతరం ఆదర్శ్ సురభి తిరిగి విధుల్లో చేరి వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- ఘనపూర్‌లో ఉపాధి హామీ పనులు, గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా ఘనపూర్ మండలంలో ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు సంఖ్యను మరింత పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఘనపూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులను, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఘనపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఫీడర్ ఛానల్ పనులను, అలాగే వెంకటంపల్లి గ్రామంలోని ఫామ్ పాండ్ పనులను డీఆర్డీఓతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు చేస్తున్న కూలీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వీబీ–జీ–రామ్–జీ సిబ్బందితో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి పనులకు కూలీల సంఖ్యను పెంచాలని, కూలీలకు పనులపై అవగాహన కల్పిస్తూ పెద్దఎత్తున పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఘనపూర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల వసతి గృహంలోని వంటగది, భోజనశాల, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు తదితర వసతులను నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, ప్రభుత్వ మెనూ అమలు తీరు, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యమైన భోజనం అందించాలి. వంటగది, భోజనశాల, వసతి గృహాలు, మరుగుదొడ్లలో ఎల్లప్పుడూ పరిశుభ్రత పాటించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలి. వారి విద్యా ప్రగతిని నిరంతరం సమీక్షించాలి. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ఉమాదేవి, డీటీడీఓ మధు, ఘనపూర్ ఎంపీడీఓ, ఏఈఈ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వీబీ–జీ–రామ్–జీ సిబ్బంది, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిదర్శనం.. ఏఓ అబ్రహం లింకన్

- 33 ఏళ్ల మచ్చలేని సర్వీసు!
- పదవీ విరమణ కార్యక్రమంలో కొనియాడిన అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : రెవెన్యూ శాఖలో 33 సంవత్సరాల పాటు ఎలాంటి మచ్చలేకుండా సేవలు అందించి పదవీ విరమణ చేయడం ఎంతో హర్షణీయమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ప్రశంసించారు. ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారిగా (ఏఓ) విధులు నిర్వహించి, శనివారం పదవీ విరమణ చేసిన కె. అబ్రహం లింకన్ వీడ్కోలు కార్యక్రమం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్వో రామ్‌రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వివిధ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజల మన్ననలు పొందిన అబ్రహం లింకన్

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అబ్రహం లింకన్ తన సుదీర్ఘ సర్వీసులో బాధ్యతలను ఎంతో నిబద్ధతతో నిర్వర్తించి ప్రజల సమస్యలు పరిష్కరించారని కొనియాడారు. "అబ్రహం చాలా మృదుస్వభావి. ఎక్కడా దురుసుగా ప్రవర్తించే స్వభావం ఆయనది కాదు. తన వద్దకు వచ్చే ప్రతి ఒక్కరినీ ప్రేమ, అభిమానంతో పలకరించి, వారి సమస్యలు తీర్చేవారు" అని ఆయన సేవలను స్మరించుకున్నారు.

రెవెన్యూ సిబ్బందికి హితవు

అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అబ్రహం లింకన్ మార్గాన్ని అనుసరించాలని సూచించారు. తమ వద్దకు వచ్చే ప్రజల సమస్యలను నిదానంగా, ఓపికగా విని వాటిని పరిష్కరించే గుణం అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది అబ్రహం లింకన్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టరేట్ లో రాష్ట్రీయ ఏక్తా దివస్

నిజామాబాద్, అక్టోబర్ 31 :(విజన్ ఆంధ్ర) రాష్ట్రీయ ఏక్తా దివస్ ను పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, అధికారులు, సిబ్బందిచే జిల్లా రెవెన్యూ అధికారిణి గీత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తానని, తోటి వారందరిలో ఈ భావనను పెంపొందించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థ సేవలందించాలి

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్
- లంచం తీసుకోవడమే కాదు.. ఇవ్వడం కూడా నేరమే
- ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కే. జిలానీ
- అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఫిర్యాదుల కోసం ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలి

వనపర్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర) : విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్2026లో భాగంగా శనివారం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. జిలానీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ప్రభుత్వ ఉద్యోగం సేవ చేసే గొప్ప అవకాశం

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగం ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశమని, ప్రతి ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అవినీతికి దూరంగా ఉంటూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని ఆయన అన్నారు. అవినీతికి అలవాటు పడితే అది వ్యసనంగా మారి, నిజాయితీగా పనిచేసే తోటి ఉద్యోగుల ప్రతిష్ఠను సైతం దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను గుర్తించి ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం

ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. జిలానీ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నైతిక విలువలు పాటిస్తూ, అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం రెండూ నేరాలేనని స్పష్టం చేసిన ఆయన.. అవినీతిని అరికట్టేందుకు అవినీతి నిరోధక శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా లేదా ఇతర అక్రమాలు జరిగినా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఇన్‌స్పెక్టర్ సూచించారు. అవినీతికి సంబంధించిన సమాచారాన్ని ఏసీబీ దృష్టికి తీసుకువచ్చి, అవినీతి రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు సైతం భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామిరెడ్డి, జెడ్పీ సీఈవో యాదయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై నాన్చుడు ధోరణి తగదు!

- అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రత్యేక జీవో ద్వారా స్థలాలు కేటాయించాలి
- జేఎన్‌జే సొసైటీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయం
- ప్రభుత్వ తీరు పై టీడబ్ల్యూజేఎఫ్ ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 31 (విజన్ ఆంధ్ర): రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యపు వైఖరిని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా తప్పుబట్టింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు నిజాంపేటలో కేటాయించిన 32 ఎకరాల భూమిని పోలీసులు, రెవెన్యూ అధికారుల ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని సీల్ వేయించడం ఏమిటని వారు ప్రశ్నించారు. గత 18 ఏళ్ల క్రితం ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇళ్ల స్థలాల కోసం ఇంతకాలం ఎదురుచూస్తున్న జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాం పేటలో సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/2 లో 38 ఎకరాల భూమి కేటాయించారని, ఈ భూమిని ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లడమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలుమార్లు హామీలిచ్చారని వారు గుర్తుచేశారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం పలు సందర్భాల్లో జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు అందిస్తామని ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులు నేటికీ సొంత ఇంటి స్థలం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే తరహాలో వ్యవహరించకూడదని వారు హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలకు, హామీలకే పరిమితం కాకుండా ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో) జారీ చేసి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలో జేఎన్‌జే సొసైటీకి కేటాయించిన భూమి విషయంలోనూ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకొని సభ్యులకు న్యాయం చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సమీకరించి చైతన్య యాత్రలు నిర్వహించడంతో పాటు ఇళ్ల స్థలాల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు హెచ్చరించారు.

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి పొదుపును పాటించాలి

- 'దిశా' సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్
- ఆర్ఓబీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశం
- అందుబాటులో ఉన్న నీటి వనరులను తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం: కలెక్టర్ వెల్లడి

నిజామాబాద్, అక్టోబర్ 31 :(విజన్ ఆంధ్ర) ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే మాధవనగర్, అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయించాలని, రానున్న నాలుగైదు నెలల్లో వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. అంతకుముందు గత సమావేశంలో చేసిన తీర్మానాలపై చేపట్టిన చర్యల గురించి అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ప్రజల్లో, రైతులలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కాగా, మాధవనగర్, అర్సపల్లి ఆర్.ఓ.బీల నిర్మాణాలలో ఎనలేని తాత్సారం జరుగుతోందని ఎం.పీ సంబంధిత అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్విరామంగా పనులు జరిపిస్తూ నాలుగైదు నెలలలో పూర్తి చేయించాలని, మరోమారు గడువు పొడిగింపుకు ఉండకూడదని ఆర్ అండ్ బీ, రైల్వే అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మెరుగుదల పనులను, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుండి కేటాయించబడిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రజోపయోగ పనులు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నిధులను విద్యార్థులకు అందించారా అని ఎం.పీ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో నేరుగా ఉపకార వేతనాలను జమ చేయించామని సంక్షేమ శాఖల అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. కాగా, డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలకు జిల్లా యంత్రాంగం చొరవతో ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాను వేదికగా ఎంపిక చేయడం పట్ల ఎం.పీ అర్వింద్ హర్షం వెలిబుచ్చారు. క్రీడా పోటీల విజయవంతానికి, జిల్లాలో క్రీడా సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి పూర్తి స్థాయిలో సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎల్ నినో ప్రభావం గురించి వివరిస్తూ, అధికార యంత్రాంగం తరపున చేపడుతున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. అదృష్టవశాత్తు ఖరీఫ్ సీజన్ లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో జిల్లా రైతాంగం గట్టెక్కగలిగారని అన్నారు. అయితే ప్రస్తుతం యాసంగిలో మాత్రం పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదని, ఈ మేరకు ప్రభుత్వం కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. వర్షాభావం, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని 18 మండలాలలో సాధారణ కరువు నెలకొని ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రబీలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, పప్పు దినుసులు వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు రాయితీపై ఆరుతడి పంటల విత్తనాలు అందిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో వీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్, జూలై మాసాల వరకు కూడా వర్షాలు కురిసే పరిస్థితి లేనందున ప్రస్తుతం జలాశయాల్లో నిలువ ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇదే సమయానికి 80 టీ.ఎం.సీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 35 టీ.ఎం.సీలకే పరిమితం అయ్యిందన్నారు. అదేవిధంగా నిజాంసాగర్ రిజర్వాయర్ లోనూ గతేడాది 17 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 9 టీ.ఎం.సీలు మాత్రమే ఉందన్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టం సైతం వేగంగా పడిపోతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక వైపు వేట... మరో వైపు విచారణ

- సీఎంఆర్ కుంభకోణం లో సీఐడి దూకుడు
- మిస్సయినా మిల్లర్ల కోసం వెతుకులాట
- కోర్ట్ అనుమతి తో పలువురు మిల్లర్ల విచారిస్తున్న సీఐడి

నిజామాబాద్ అక్టోబర్31:(విజన్ ఆంధ్ర) : రాష్ట్రశీ లో వెలుగు చుసిన సన్న వడ్లు తీసుకొని ఎఫ్ సి ఐ కీ దొడ్డు బియ్యం అంటగాట్టిన కుంభకోణం పై సీఐడి దూకుడు పెంచింది. ఈ కేసులో 16 మంది మిలర్ల కు గాను 14 మంది ని అరెస్ట్ చేయగా ఇద్దరు పరార్ అయినా విషయం విధితమే. ఇద్దరు మిల్లర్లు కోర్ట్ ను ఆశ్రయించి బెయిల్ పొందినట్టు తెలిసింది. రిమాండ్ లో ఉన్న 14 మందిని విచారణ కు సీఐడి కస్టడీ పిటిషన్ దాఖలు చేయగా కోర్ట్ అనుమతించింది. మిల్లర్ లను ఇవ్వాళ, రేపు విచారణ చేయనున్నారు. ఇదిలా ఉండగా కొన్ని రైస్ మిల్లు లలో భాగస్వాములు ఇప్పటికి పరారీలో ఉండగా వారి కోసం సీఐడి వేట మొదలు పెట్టింది. వారి కోసం గాలింపు చేపట్టింది. రాష్ట్రం లో 16 రైస్ మిల్లులు 242 కోట్ల విలువైన బియ్యం విషయంలో ప్రభుత్వంను మోసం చేసినందుకు పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ పిర్యాదు మేరకు నిజామాబాద్, కరీంనగర్, ములుగు, మిర్యాలగూడ కు చెందిన మిల్లర్ లపై సీఐడి కేసులు నమోదు చేసి 14 మంది మిల్లర్ లను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అందులో కేవలం నిజామాబాద్ జిల్లా కు చెందిన 6 రైస్ మిల్లు లు ఉన్నాయి. అందులో నలుగురు మిల్లర్ యజమానులు అరెస్ట్ చేయగా వారి పార్టనర్ లు ఎస్కెప్ అయ్యారు. సీఐడి కీ చిక్కకుండ పారి పోయిన వారి కోసం సీఐడి డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి గాలిస్తున్నారు. రిమాండ్ లో ఉన్న వారిని విచారిస్తున్నారు. సీఐడి విచారణ లో సన్న వడ్లు తీసుకొని ఏమి చేసారు,వడ్లను అమ్ముకున్నది, ఎలా పక్కదారి పట్టించింది తేలే అవకాశం ఉంది. సన్న వడ్లు తీసుకొని దొడ్డు బియ్యం అప్పగింతలో ఎవరి ప్రయోజనం ఎంత అనే అంశాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూ తేదీలు ఖరారు

ములుగు అక్టోబర్ 31;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లాలో 31 టీచర్, 104 హెల్పర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలకు కలెక్టర్ అనుమతించారు.

ఇంటర్వ్యూ తేదీలు (ఐ డి ఓ సి, ములుగు):

- తాడ్వాయి టీచర్లు: 04.11.2026
- వెంకటాపురం టీచర్లు: 05.11.2026
- తాడ్వాయి హెల్పర్లు: 06.11.2026
- వెంకటాపురం హెల్పర్లు: 07.11.2026

సమయం: ఉ.11 గం. నుండి సా.4 గం. వరకు సిడిపిఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనలో అర్హులైన వారు మాత్రమే హాజరు కావాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత తెలిపారు. అర్హుల జాబితా మండల కార్యాలయాల్లో అందుబాటులో ఉంది.

కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలి

- తెలంగాణ రాష్ట్ర హై కోర్టు జడ్జి గాడి ప్రవీణ్ కుమార్

మెదక్, అక్టోబర్ 31:(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి) : కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలని తెలంగాణ రాష్ట్ర హై కోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం నర్సాపూర్ లో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నర్సాపూర్ కోర్టు ప్రాంగణానికి చేరుకున్న హై కోర్టు జడ్జి కి పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కోర్టు ప్రాంగణంలో హై కోర్టు జడ్జి మొక్కను నాటి ,నీటిని పోశారు . అనంతరం కోర్టు ప్రాంగణంలో సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర హై కోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ. కక్షిదారులకి సత్వరమే న్యాయం అందాలన్నారు . న్యాయవాది వృత్తిలో ఉన్న న్యాయవాదులందరూ ఈ ధర్మాన్ని పాటించి, అన్యాయాన్ని సహించొద్దన్నారు. బార్ సోసియేషన్, బెంచ్ అన్నదమ్ముల అనుబంధాన్ని కొనసాగించాలన్నారు. డ్రైవర్లు డ్రెస్ కోడ్ను పాటించి, క్రమశిక్షణగా మెదగాలన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, జీవితంలో అమ్మను మించిన గురువు లేరన్నారు. కక్షిదారుల సమస్యలన్నీ సామరస్యంగా పరిష్కరించాలని నిష్పక్షంగా న్యాయం చేయాలన్నారు.

ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి మెదక్ జిల్లా న్యాయమూర్తి నీలిమ మాట్లాడుతూ నర్సాపూర్ పరిసర ప్రాంత ప్రజలకు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయడం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి త్రాగునీటి ఇబ్బంది తీర్చాలని, కక్షిదారులకు మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా అతి తక్కువ ధరలో భోజనం ఏర్పాటు చేయించాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి ప్రవీణ్ కుమార్ కు జిల్లా జడ్జీలు, బార్ అసోసియేషన్ సభ్యులు మెమెంటో అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో .జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ , ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, శుభవల్లి అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి మెదక్, రూబీనా ఫాతిమా సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అతరిటీ మెదక్ , సాయి ప్రభాకర్ మెదక్ మొబైల్ కోర్ట్, సుచరిత జూనియర్ సివిల్ జడ్జి అల్లదుర్గ, హేమలత జూనియర్ సివిల్ జడ్జి నర్సాపూర్ ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ,బార్ మెంబర్స్ , వివిధ అడ్వకేట్ బార్ అసోసియేషన్స్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారుల డప్పు గానాలతో దద్దరిల్లనున్న సిరిసిల్ల

- నవంబర్ 3న చలో సిరిసిల్ల..

- తెలంగాణ కళాకారులతో జానపద కళా సంగమం

- కళాకారుల ఐక్యతే లక్ష్యం సంక్షేమమే ధ్యేయం

- రాష్ట్ర ప్రభుత్వ టూరిజం, భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న

హైదరాబాద్ అక్టోబర్ 31 విజన్ ఆంధ్ర : తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద కళా వైభవానికి సిరిసిల్ల వేదిక కానుంది. పల్లె డప్పుల దరువులు, జానపద గీతాలు, కళాకారుల ఆటపాటలతో సిరిసిల్ల గడ్డ మారు మోగనుంది. నవంబర్ 3న తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ టూరిజం, భాషా సాంస్కృతిక శాఖ సలహాదారు దరువు అంజన్న తెలిపారు, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమం, హక్కుల సాధన, ఐక్యతే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వివిధ సంస్థలుగా విడివిడిగా కొనసాగుతున్న కళాకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సంఘటిత శక్తిగా తమ సమస్యలపై పోరాడాలన్నదే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు, కళాకారుల బతుకుల్లో వెలుగులు నింపడం, వారి కష్టసుఖాల్లో అండగా నిలవడం, హక్కుల సాధనకు భరోసా కల్పించడమే తమ లక్ష్యమన్నారు, పోరాడుదాం తెలుగు ఫోక్ అసోసియేషన్ పేరుతో కళాకారుల ఐక్య గళాన్ని వినిపించనున్నట్లు తెలిపారు, నవంబర్ 3న సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 6 గంటల నుంచి జానపద సంగీత విభావరి ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాల నుండి ప్రముఖ జానపద కళాకారులు తరలివచ్చి డప్పుల దరువులు, జానపద గీతాలు, సంప్రదాయ కళారూపాలు, ఆటపాటలతో ప్రేక్షకులను అలరించనున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం తెలంగాణ పల్లె సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళా జాతరగా నిలవనుందని అన్నారు, గత నెల రోజులుగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీ సభ్యులు సభ విజయవంతానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారని దరువు అంజన్న అభినందించారు. ముఖ్యంగా ఈ కార్యక్రమ నిర్వహణకు ముందుకొచ్చిన సిరిసిల్ల కళాకారుల చొరవ, కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు, తెలంగాణ జానపద కళలకు తగిన గుర్తింపు, కళాకారులకు గౌరవం, వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ లక్ష్యమని పేర్కొంటూ. రాష్ట్రంలోని కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నవంబర్ 3న జరిగే ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని దరువు అంజన్న పిలుపునిచ్చారు

వేదాలే భారతీయ సంస్కృతికి జీవనాడి

-గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

-వేద పరిరక్షణలో గురు-శిష్య పరంపరది కీలక పాత్ర

-యాదగిరిగుట్టలో 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభలు

యాదగిరిగుట్ట,అక్టోబర్ 31(విజన్ఆంధ్ర) : వేదాలు భారతీయ నాగరికతకు, సంస్కృతికి మూలస్తంభాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. వేద జ్ఞానం ఆధ్యాత్మికతకే పరిమితం కాదని.. ప్రకృతి పరిరక్షణ, నైతిక విలువలు, మానవ జీవనం, సామాజిక సామరస్యానికి దిక్సూచి అని స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తరతరాలుగా వేద సంపదను కాపాడుతున్న గురు–శిష్య పరంపర భారతీయ సంస్కృతికి గొప్ప వారసత్వమని కొనియాడారు. వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తున్న ఆచార్యుల అంకితభావం ప్రశంసనీయమన్నారు. వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులను అభినందిస్తూ.. వారి క్రమశిక్షణ, సాధన వేద సంప్రదాయాల భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. జయపత్రాలు అందుకున్న పది మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు. యాదగిరిగుట్టను వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి మరింత ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. ప్రాచీన వేద విజ్ఞానాన్ని ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించాలని, వేద విద్యా సంస్థలు, గురుకులాలకు ప్రోత్సాహం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు,ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, ధార్మిక సలహాదారు ఆర్.గోవింద్ హరి,దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,దేవస్థానం ఈఓ భవానీ శంకర్, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

రవితేజ 'ఇరుముడి' మూవీ నిర్మాతలకు కార్మిక శాఖ షాక్

మైనర్ బాలికతో షూటింగ్ వ్యవహారంపై నోటీసులు, నవంబర్ 4న విచారణకు హాజరు కావాలని ఆదేశం

జిల్లా మేజిస్ట్రేట్ అనుమతి, తల్లిదండ్రుల సమ్మతి, పని గంటలు, పారితోషికంపై ప్రశ్నల వర్షం

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31: టాలీవుడ్ స్టార్ హీరో రవితేజ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఇరుముడి' నిర్మాతలకు తెలంగాణ కార్మిక శాఖ నోటీసులు జారీ చేసింది. సినిమా షూటింగ్‌లో ఓ మైనర్ బాలికతో పనిచేయించడంపై అధికారులు సీరియస్ అయ్యారు. మంత్రి వివేక్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. బాల కార్మిక చట్ట ఉల్లంఘన జరిగిందా అనే కోణంలో విచారణ చేపట్టారు.

మూవీ టీంను జాయింట్ కమిషనర్ ప్రశ్నలు

బాలిక సినిమా షూటింగ్‌లో నటించడానికి ముందు జిల్లా మేజిస్ట్రేట్ నుండి అనుమతి తీసుకున్నారా? అలాగే బాలిక తల్లిదండ్రుల నుండి అధికారిక సమ్మతి పత్రం పొందారా? అంటూ మూవీ టీంను తెలంగాణ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ప్రశ్నించారు. చట్ట ప్రకారం మైనర్ పిల్లలతో పనిచేయించాలంటే తప్పనిసరిగా జిల్లా మేజిస్ట్రేట్ అనుమతి, తల్లిదండ్రుల లిఖితపూర్వక సమ్మతి అవసరం. ఆ నిబంధనలు పాటించారా లేదా అనేదానిపై అధికారులు దృష్టి సారించారు.

ఏయే వివరాలు అడిగారంటే...

బాలికకు సంబంధించిన కాల్ షీట్లు, అటెండెన్స్ రికార్డులు, షూటింగ్‌లో పాల్గొన్న పని గంటల వివరాలు స్పష్టం చేయాలని ఆదేశించారు. అలాగే బాలిక చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా తీసుకున్న చర్యలు ఏమిటి? ఆమె భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక సంరక్షకుడిని నియమించారా? అనే అంశాలపై కూడా వివరణ కోరారు. బాలిక పారితోషికంలో 20 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జమ చేశారా? అని ప్రశ్నించిన అధికారులు, సినిమా ప్రమోషన్ ఈవెంట్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బాలిక పాల్గొనేలా చేయడంపై కూడా వివరణ ఇవ్వాలని కోరారు.

నవంబర్ 4న విచారణ

ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన పూర్తి ఆధారాలతో నవంబర్ 4 ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సినిమా నిర్మాతలకు కార్మిక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. మైనర్ బాలికలతో సినిమా షూటింగ్‌లు, ప్రమోషన్ కార్యక్రమాల విషయంలో కఠిన నిబంధనలు ఉన్న నేపథ్యంలో ఈ నోటీసులు టాలీవుడ్ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విచారణలో ఏం తేలనుందో అనే దానిపై అందరిలో ఆసక్తి నెలకొంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామేమో..!

- తెలంగాణ కాంగ్రెస్ కు నిద్ర లేకుండా చేస్తున్న కర్ణాటక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫలితాలు

- కర్ణాటకలో 4 స్థానాల్లో ఓటమితో తెలంగాణ నేతల్లో తీవ్ర ఆందోళన

- 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు 10 మంది మంత్రుల భవిష్యత్తును నిర్ణయించనున్నాయా?

తెలంగాణ స్టేట్, బ్యూరో విజన్ ఆంధ్ర, అక్టోబర్ 31 : కర్ణాటకలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామేమో అనే భయం పార్టీ నేతలను వెంటాడుతోంది. కర్ణాటకలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ ఓటమి పాలు కావడంతో తెలంగాణ నేతల్లో ఆందోళన మొదలైంది. ఇతర రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయంతో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఓడిపోతామన్న భయం పట్టుకుందా అనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

కర్ణాటక గెలిస్తేనే తెలంగాణలో అధికారం అన్న చరిత్ర

గత అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో గెలిచాకనే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో కర్ణాటక ఫలితాల ప్రభావం తెలంగాణపై తప్పకుండా ఉంటుందని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే కర్ణాటక ఫలితాలను తెలంగాణ నేతలు అత్యంత ఆందోళనతో పరిశీలిస్తున్నారు. కర్ణాటకలో జరిగిన పరిణామాలు ఇక్కడ కూడా పునరావృతమవుతాయేమోనన్న ఆలోచన పార్టీలో బలంగా వినిపిస్తోంది.

10 మంది మంత్రులకు కీలకంగా మారిన 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు

తెలంగాణలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఇప్పుడు మొత్తం 10 మంది మంత్రులకు కీలకంగా మారాయి. ఈ రెండు స్థానాల ఫలితాలే రాబోయే రోజుల్లో మంత్రుల ప్రాబల్యం, పార్టీలో వారి స్థానంపై ప్రభావం చూపుతాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటమి ఖాయమంటూ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక ఎన్నిక ఫలితం మరో ఎన్నికపై ఇంత ప్రభావం చూపుతుందా అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

అభ్యర్థి ఎంపికలోనే అసలు సమస్య

ఖమ్మం, వరంగల్, నల్గొండ అభ్యర్థి ఎంపిక విషయంలో సొంత పార్టీలోనే అభిప్రాయభేదాలు బయటపడుతున్నాయి. ఎవరికి టికెట్ ఇవ్వాలి అనే విషయంలో నేతల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. మరోవైపు గ్రాడ్యుయేట్ ఎన్నికలతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యేల తీరు కూడా పార్టీ అధిష్టానాన్ని ఆలోచనలో పడేస్తోంది. అభ్యర్థి ఎంపికపై స్పష్టత లేకపోవడం, స్థానిక నేతల నుండి పూర్తి సహకారం అందకపోవడం పార్టీకి ఇబ్బందిగా మారే అవకాశం ఉందని పరిశీలకులు అంటున్నారు.

తమిళనాడు తరహా ఫలితమేనా అని రేవంత్ వ్యాఖ్య

తమిళనాడు తరహాలోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సీఎం స్వయంగా ఇలా చెప్పడం పార్టీ శ్రేణుల్లో మరింత కలవరపాటుకు కారణమైంది.

ఓటమి భయం, మరోవైపు వ్యతిరేకత

ఒకవైపు ఓటమి భయం పార్టీ నేతలను వెంటాడుతుండగా, మరోవైపు నిరుద్యోగులు, ఉద్యోగుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందనే అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ రెండు అంశాలు కలిస్తే ఎన్నికల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతే రేపు భవిష్యత్తులో జరిగే ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అనే బుగులు పట్టుకుందని కాంగ్రెస్ నేతలు స్వయంగా చర్చించుకుంటున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీసు ఫ్లాగ్ డే

- నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

- రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమంలో భాగంగా రన్ కార్యక్రమం నిర్వహించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్ అక్టోబర్31:(విజన్ ఆంధ్ర) : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే) ను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్ ఆధ్వర్యంలో " కొవ్వొత్తుల ర్యాలీ " కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కొవ్వొత్తుల ర్యాలీ / రన్ కార్యక్రమం కోర్టు చౌరస్తా నుండి ప్రారంభించి మున్సిపల్ ఆఫీసు – ఎన్.టి.ఆర్ చౌరస్తా – పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించి అక్కడ అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తుల పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు ఎవ్వరు కూడా మరవరు అని , వారి త్యాగాల వలన నేడు ప్రతీ ఒక్కరు శాంతియుతంగా ఉంటున్నారని , అమరవీరుల కుటుంబాలకు యావత్తు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ

కార్యాక్రమంలో అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్ , నిజామాబాద్ , ట్రాఫిక్ ఎ.సి.పిలు ప్రకాష్ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రాజ్ , రిజర్వుఇన్స్పెక్టర్స్ ధరణి , శేఖర్ బాబు , సి.ఐలు , ఎస్.ఐలు , పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీను , పోలీస్ సిబ్బంది , స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు , వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బియ్యం ధరలపై కీలక నిర్ణయం...

- అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు...

- నిర్ణయించిన గరిష్ట ధరలకే బియ్యం విక్రయించాలి...

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 31, (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల బియ్యం విక్రయ ధరలపై కమిషనర్ గారితో జిల్లా మరియు రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రా రెడ్డి తెలిపారు. నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలు: తెలంగాణ దీూ బియ్యం కిలో రూ. 66 తెలంగాణ సోనా బియ్యం కిలో రూ. 74 తెలంగాణ శ్రీరామగోల్డ్ బియ్యం కిలో రూ. 79 రైస్ మిల్లర్లు, రైస్ ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, రిటైలర్లు నిర్ణయించిన గరిష్ట విక్రయ ధరలకు మించకుండా బియ్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వినియోగదారుల నుంచి నిర్ణయించిన ధరల కంటే అధిక మొత్తాన్ని వసూలు చేయరాదని స్పష్టం చేశారు. నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా సంబంధిత వ్యాపారులు నిర్ణయాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ కె. చంద్రా రెడ్డి కోరారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.